మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 167 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





## గురుకుల విద్యార్థినికి అండగా సీఎం రేవంత్ రెడ్డి

- ప్రభుత్వ ఖర్చుతో నిమ్స్ లో వైద్యం
- కోలుకుంటున్న విద్యార్థిని కార్తీక



హైదరాబాద్, (ప్రజా మంటలు):
గురుకుల పాఠశాల భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలైన విద్యార్థిని కొయ్యడ కార్తీక కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందించాలని ఆయన సీఎం కార్యాలయ అధికారులను ఆదేశించారు. సీఎం సూచన మేరకు హైదరాబాద్ లోని నిమ్స్ లో కార్తీక కు వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. ప్రస్తుతం కార్తీక కోలుకుంటోంది. ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కార్తీక ఈ నెల 9న ప్రమాదవశాత్తు స్కూల్ మూడో అంతస్తు నుంచి పడిపోయింది. దీంతో విద్యార్థిని నడుము భాగంలో తీవ్రగాయాలయ్యాయి. గురుకుల అధికారులు కార్తీకను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి కి ,అక్కడి నుంచి నిమ్స్ కు తరలించారు. నిమ్స్ న్యూరో సర్జన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమల్ బృందం మంగళవారం నాడు కార్తీక కు ఆపరేషన్ నిర్వహించింది.. ప్రస్తుతం ఐసీయులో విద్యార్థిని కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్తీక కు కావాల్సిన వైద్యం ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరించనున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తో మాట్లాడి కార్తీక కోలుకునేంత వరకు వైద్యం అందించాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా కార్తీక ఆరోగ్య పరిస్థితిపైన ఎప్పటికప్పుడు నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్నారు.



తెలంగాణ ఉద్యోగులను

## రిలీవ్

- ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి (ప్రజా మంటలు):
తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో కేటాయించిన 122 మంది నాన్‌గెజిటెడ్ మిగతా 2లో..

## తుంగభద్రపై తాత్కాలిక గేటు ఏర్పాటుకు కసరత్తు

- ఈప్రక్రియ ఇంజనీరింగ్ సాహసం - నిపుణుల వెల్లడి

బళ్లారి (ప్రజా మంటలు):
కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇది ఇంజినీరింగ్ సాహసమేనని నిపుణులు చెబుతున్నారు. 19 నంబర్ గేటు స్థానంలో 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు ఉన్న భారీ గేటును అమర్చనున్నారు. ఒకవైపు నీరు వెళ్తుండగానే దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులను జిందాల్‌తో పాటు మరో రెండు సంస్థలకు అప్పగించారు. గేటు ముక్కలను తయారు చేసి తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మూడు సంస్థలు తయారు చేసిన గేటు ముక్కలను ప్రవాహం మీద ఉంచి అక్కడే వెల్డింగ్ చేసి అతుకులు పెట్టనున్నారు. 8 అడుగుల ఎత్తులో భారీగా వెళుతున్న ప్రవాహం మీది నుంచి నీటిని అడ్డుకుంటూ గేటును కిందికి దించనున్నారు. నిండుగా ఉన్న ప్రాజెక్టునుంచి నీరు వెళుతుండగా గేటు అమర్చడం సాహసోపేతమైన చర్యగా నిపుణులు పేర్కొంటున్నారు.

## డాక్టర్‌పై హత్యాచార కేసు సీబీఐకి

- కోల్‌కతా హైకోర్టు ఆదేశం



కోల్‌కతా (ప్రజా మంటలు):
కోల్‌కతాలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై దేశవ్యాప్తంగా డాక్టర్లు నిరసన తెలుపుతున్నారు. ఈ సమయంలో కలకత్తా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది.కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలని పోలీసులను ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలను బుధవారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందజేయాలని పేర్కొంది. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆసుపత్రిలో ఉన్నవారికి ఆ విషయం తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.ఈ కేసులో నిందితుడికి పోలీసులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సాక్ష్యాలు తారుమారు చేయకుండా ఉండేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరినట్లుగా న్యాయస్థానం పేర్కొంది. గతంలో జరిగిన ఓ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు ఆధారంగా న్యాయపరమైన దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేపడుతున్న నిరసనలపై మిగతా 2లో..

### కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

మద్యం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
మద్యం విధానం కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, భారాస ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది.ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉంటున్న ఈ నేతలిద్దరి కస్టడీని సెప్టెంబర్ 2వరకు పొడిగించింది.
మిగతా 2లో..

## పేర్లు మార్చి ఖర్చు పెంచేశారు

- ప్రాజెక్టుల కోసం రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా ఫలితం నామమాత్రమే
- నీటిపారుదల శాఖను గాడిలో పెడుతున్నాం
- గత ప్రభుత్వం కమీషన్ల కోసం రీ డిజైన్ చేసింది
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వార్తా లోపలి పేజీలో..

### పొలిట్రిక్స్

ఆర్థిక సమస్యలతో
అవుతుందా వికసితం,
అప్పుల ఊబిలో
నమోజీ భారతం !

ఆదాయం ఎంతున్న
ఖర్చులకే చాలవోయ్,
సమస్యల భారత్ లో
ఎదుగుదల ఎక్కడోయ్ !

- న్యాలకంటి నారాయణ
9346200066

## మా కాళ్లు అరిగిన కరుణించరా ప్రజాప్రతినిధులారా?

- ఇండ్ల స్థలాల కోసం ఎన్నాళ్ళు పడిగాపులు
- మా తెల్ల బట్టల వెనుక దుర్భర పరిస్థితులు ఎవరికి తెలుసు
- జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు
- జర్నలిస్టుల అర్ధ నగ్న నిరసన ప్రదర్శన. .

8లో..



## వీర్యం, అండం దానమిస్తే బిడ్డపై హక్కులుండవు

- బాంబే హైకోర్టు సంచలన తీర్పు




ముంబై (ప్రజా మంటలు):
వీర్యదాతకు, అదేవిధంగా అండం ఇచ్చిన మహిళకూ పుట్టిన బిడ్డపై చట్టపరమైన హక్కు ఉండదని బాంబే హైకోర్టు వెల్లడించింది. పిల్లలకు వారు జీవసంబంధ తల్లిదండ్రులుగా చెప్పడం కుదరదని స్పష్టం చేసింది.తన కవల కుమార్తెలను చూసేందుకు ఓ మహిళకు అనుమతిస్తూ ఈ తీర్పు చెప్పింది.తన కవల పిల్లలు సరోగసీ ద్వారా జన్మించారని, వారు తన భర్త, సోదరితో ఉంటున్నారంటూ ఓ మహిళ కోర్టులో పిటిషన్ వేశారు. తన సోదరే అండం దానం చేసిందని, కానీ తన భర్త మాత్రం అండం దానం చేసిన మరదలికే పిల్లలపై చట్టపరమైన హక్కు ఉంటుందని వాదిస్తున్నారని పేర్కొంది. ఆ వాదనను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ సోదరిని జీవసంబంధ తల్లిగా చెప్పే హక్కు ఉండదని స్పష్టం చేసింది.పిటిషనర్ సోదరి చేసిన అండ దానంతో సరోగసీ ద్వారా 2019లో కవలలు జన్మించారు. అదే సమయంలో పిటిషనర్ సోదరి కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. దాంతో ఆమె కుమార్తె, భర్త మృతి చెందారు. 2019 నుంచి 2021 మార్చి వరకు ఇద్దరు పిల్లలతో కలిసి పిటిషనర్, ఆమె భర్త కలిసే ఉన్నారు. ఆ తరువాత వైవాహిక బంధంలో విభేదాల కారణంగా మిగతా 2లో..



8లో..

## జ్యోతిబా పాఠశాలలో ఆటలాడుతుండగా అస్తమా బాలిక పడిపోవడంతో షాక్ కు గురైన బాలికలు

## ప్రజా నాడి




## రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కదనరంగంలో హుజూరాబాద్ యువకెరటం

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్ష బరిలో యేసుపాదం థామస్
- హోరాహోరీగా సభ్యత్వ నమోదు
- 13 ఏళ్లుగా ఎన్ఎస్ యుఐలో వివిధ హోదాల్లో సేవలు
- రాష్ట్ర యువతలో మంచి గుర్తింపు ఉండడం కలిసోచ్చే అంశం
- ప్రజా మంటలు ప్రతినిధి కాశిరెడ్డి ఆదిరెడ్డి ప్రత్యేక కథనం

హైదరాబాద్ ఆగస్టు 13 (ప్రజామంటలు) :
కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన అడ్వకేట్, విద్యావంతుడు ఎస్. వై థామస్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బరిలో ఉన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఆన్లైన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తున్న ఈ సందర్భంలో, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అంతర్గత యూత్ కాంగ్రెస్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపింపజేస్తున్నాయి.

**థామస్ కి రాష్ట్ర అధ్యక్షుడిగా కలిసొచ్చే అంశాలు**

థామస్ గత పదమూడు సం.లుగా కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అయిన ఎన్ఎస్ యు.ఐ లో చురుకైన కార్యకర్తగా పేరు తెచ్చుకున్నాడు. కాలేజ్ ప్రెసిడెంట్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పలు జిల్లాలకు వివిధ హోదాలలో ఇంచార్జ్ గా సేవలు అందించాడు. రాష్ట్ర యువత లో మంచి గుర్తింపు పొందిన నాయకుడు. ఎన్నో విద్యార్థి సమస్యల పైన నిరంతర పోరాటం చేస్తున్న యువ నాయకుడు.



**మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు** యూత్ లో ఫాలోయింగ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో ముందున్న వ్యక్తిగా మంచి పేరు ఉంది. ఆగస్టు 14 నుండి సెప్టెంబర్ 14 వరకు జరిగే రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తనదైన శైలిలో ముందుకెళ్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో మండలాలలో యూత్ ఫాలోయింగ్ ఉండడంతో రాష్ట్ర అధ్యక్షుడిగా గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రాష్ట్రస్థాయి ముఖ్య నేతలతో సత్సంబంధాలు ఉండడం మండల స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు మద్దతు కూడగడుతూ పక్క యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూత్ మద్దతు ఉండడంతో థామస్ గెలుపు ఖాయమైనట్లేనని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



With Hon'ble Sri Rahul Gandhi Ji in Pada Yathra - Campaigning for 2023 Telangana Assembly Elections.




Congratulating Hon'ble Chief Minister of Telangana Sri A.Revanth Reddy Garu

మొదటి పేజీ తరువాయి

## తెలంగాణ ఉద్యోగులను రిలీవ్

ఉద్యోగులను స్వరాష్ట్రానికి పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.తెలంగాణ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ఏపీ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారు తమ కేడర్ చివరి ర్యాంక్‌లోనే విధుల్లో చేరతారని వెల్లడించింది.

## వీర్యం, అండం దానమిస్తే బిడ్డపై హక్కులుండవు

**- బాంబే హైకోర్టు సంచలన తీర్పు**

2021లో భార్యకు చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి భర్త వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ రోడ్డు ప్రమాదంతో కుంగుబాటుకు గురైన తన మరదలు.. పిల్లల బాగోగులను చూసుకునేందుకు తనతోనే ఉంటుందని పిటిషనర్ భర్త చెప్పడంతో పిటీషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, స్థానిక కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తన అభ్యర్థనను తిరస్కరించడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

## కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వీరిని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

## డాక్టర్‌పై హత్యాచార కేసు సీబీఐకి

**- కోల్‌కతా హైకోర్టు ఆదేశం**

స్పందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉన్నందున.. ఆందోళనలను విరమించాలని సూచించింది.కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌పై కోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించి, సెలవుపై పంపాల్సిందిగా ఆదేశించింది.

నివేదిక సమర్పించండి: నేషనల్ మెడికల్ కమిషన్

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసుపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని దేశ వైద్య విద్యా నియంత్రణ సంస్థ నేషనల్ మెడికల్ కమిషన్ కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించింది. నివేదికను పరిశీలించిన అనంతరం తమ నియమాలకు అనుగుణంగా లేదని భావిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

గొంతు నులిపి..ముఖాన్ని గోడకేసి కొట్టి.. పాశవికదాడి..

పశ్చిమ బెంగాల్‌లో ఒక జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలిని నిందితుడు గొంతునులిమి చంపాడని, ఆ పెనుగులాటలో ఆమె థైరాయిడ్ కార్టిలేజ్ విరిగిపోయిందని పోస్టుమార్టం నివేదికను బట్టి తెలుస్తోంది.అసహజ లైంగిక చర్య.. పాశవిక దాడి కారణంగా అంతర్గత అవయవాల వద్ద లోతైన గాయం అయినట్లు వెల్లడైంది. ఆగస్టు 9న తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఐదు గంటల మధ్యలో ఈ ఘటన జరిగినట్లు సంబంధిత వర్గాల సమాచారం ఆధారంగా మీడియా వర్గాలు పేర్కొన్నాయి.ఉదరభాగం, పెదాలు, వేళ్లు, ఎడమకాలు వద్ద గాయాలున్నాయని, ఆమె కేకలు వినిపించకుండా ఉండేందుకు తలను గోడకు అదిమిపట్టి ముక్కు, నోరు మూసివేసినట్లు ఆ నివేదికలో వెల్లడైంది. అతడి దాడిని అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నంలో ఆమె ముఖమంతా గోటి గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆమె కళ్లు, నోరు, అంతర్గత అవయవాల నుంచి రక్తస్రావం జరిగినట్లు ఆ నివేదికలో ప్రస్తావించారు. అయితే ఆమె కళ్లకు ఎందుకు గాయాలు అయ్యాయో నిర్ధరణ కాలేదు. ఇదిలా ఉంటే.. ఆమె మృతదేహాన్ని ఆసుపత్రి సెమినార్ హాల్‌లో గుర్తించారు. ఈ కేసులో నిందితుడు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు.ఈ కేసు తీవ్ర సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సుదీర్ఘ సెలవులో వెళ్లాలంటూ కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఘోష్ నిన్న రాజీనామా చేసిన కొద్దిగంటలకే కలకత్తా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ సమయంలోనే కోర్టు ఆదేశాలు వచ్చాయి. "ఆసుపత్రిలో పనిచేస్తోన్న వైద్యులకు ప్రిన్సిపలే గార్డియన్. ఆయనే ఎలాంటి జాలి చూపించకపోతే ఇంకెవరు చూపిస్తారు. ఆయన ఎక్కడా పనిచేయకుండా ఇంట్లోనే ఉండాలి" అని ఆదేశించింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను ఎందుకు రక్షిస్తున్నారని ప్రభుత్వం, పోలీసులకు ప్రశ్నలు వేసింది.

## అదానీ-సెబీ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

**- హిండెన్‌బర్గ్ ఆరోపణలతో బట్టబయలు**

**- 22న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
అదానీ–హిండెన్‌బర్గ్ వివాదం వేడెక్కుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబి చీఫ్ మాధబి పూరి బచ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల వద్ద నిరసలకు దిగాలని నిర్ణయించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులతో మంగళవారం సమావేశం జరిగింది. అదానీ–సెబీకి సంబంధం ఉన్న హిండెన్‌బర్గ్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవడంపై ప్రధానంగా చర్చించాం' అని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కుంభకోణంలో మోదీ ప్రమేయంపై ఆరోపణలు గుప్పి?స్తూ, ప్రధానంగా తాము రెండు అంశాలపై దేశవ్యాప్త ఆందోళనలకు నిర్ణయించామని చెప్పారు. ప్రధాన మంత్రి పూర్తి ప్రమేయం ఉన్న అదానీ మెగా స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫైనాన్షియల్ మార్కెట్ రెగ్యులేషన్ విషయంలో పూర్తిగా మోదీ రాజీపడ్డారని ఆరోపించారు. సెబీ బాస్ రాజీనామా చేయాలనేది కూడా తమ మరో డిమాండ్ అని చెప్పారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఆయా నగరాల్లోని ఈడీ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై ఆగస్టు 10న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలున్నాయని ఆరోపించింది. దీనీపై బచ్ ఘాటుగా స్పందించారు. ఇది వ్యక్తిత్వ హననమేనని అన్నారు. అదానీ గ్రూప్ సైతం హిండెన్‌బర్గ్ ఆరోపణలు కొట్టివేసింది. సెబీ చైర్‌పర్సన్‌తో కానీ, ఆమె భర్తతో కానీ తమకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపింది.



## అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినయ్ మోహన్ బాధ్యతలు చేపట్టనున్నారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు.అమెరికాలో భారత నూతన రాయబారిగావినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు. వినయ్ మోహన్ క్వాత్రా తన అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా ఉన్నారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు. అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## సీతారామతో ఉమ్మడి జిల్లాలో గోదావరి గలగలలు

**15న వైరాలో భారీగా సిఎం రేవంత్ సభ**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి**



ఖమ్మం (ప్రజా మంటలు):
గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయాలనే సీతారామ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వం 8 వేల కోట్లతో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ మోటార్లు పాడవకుండా సద్వినియోగం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి వైరా బహిరంగ సభ సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ... ఆగస్ట్ 15న వైరాలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. ఖమ్మం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన సమీక్షించారు. రైతాంగం తలరాత మార్చే సభగా వైరా సభ నిలవనుందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. 'నా జీవిత కోరిక సీతారామతో తీరింది' అని అన్నారు. దక్షిణ అయోధ్యకు రైల్వేలైన్ రాబోతుందని.. త్వరలో కొత్తగూడెం విమానాశ్రయం రాబోతుందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే భద్రాచలం అభివృద్ధి పూర్తి స్థాయిలో చేస్తామన్నారు.ఃాజకీయ అసూయతో చేసే విమర్శలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. రాజకీయ వేధింపులు అరాచకం తన జీవితంలో లేవన్నారు. రాజకీయ విరోధులైన జలగం వెంగళరావు, రజబ్ అలీ ఇతర నేతలను వ్యక్తిగతంగా విమర్శ చేయలేదన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా స్వాగతిస్తున్నారన్నారు. పదవులు శాశ్వతం కాదని... చేసిన పనులే చరిత్రలో నిలుస్తాయన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులు ఏ పార్టీలో ఉన్నా అభిమానిస్తాం తప్ప వ్యక్తిగత విమర్శలు చేయనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## ప్రభుత్వం మొద్దునిద్ర వీడింది - కేటీఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



రాష్ట్రంలో గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటనతో ప్రభుత్వంలో చలనం వచ్చిందని బిఆర్ఎస్ ప్రకటించుకుంది. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం ప్రభుత్వ హాస్టళ్ల బాటపట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల హాస్టల్‌కు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ.. గురుకుల స్కూళ్ల సమస్యలపై మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొన్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. 8నెలల్లో కలుషిత ఆహారంతో 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. తాజాగా బీబీపేట పాఠశాలలో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన భోజన వసతి కల్పించాలి. పాఠశాలల్లో వసతులు, సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1000కు పైగా గురుకులాల్లో ప్రాణనష్టం జరగకుండా.. ఆహార నాణ్యతను మెరుగుపరిచేందుకు డిప్యూటీ సీఎం, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## మూడ్రోజుల పాటు వర్షాలు

**- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణలో రాగల మూడురోజుల పాటు తేలికపాటి మోస్తరు వర్షాపాతం కురిసే నమోదయ్యే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నాటి ద్రోణి రాయలసీమ కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులు.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం వరకు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, జయశంకర్, నల్గొండ, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో వర్షం కురిసింది. అత్యధికంగా హైదరాబాద్ నగర పరిధిలోని ఖైరతాబాద్‌లో 8.3 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

## తెలంగాణ మెడికల్ సీట్ల వ్యవహారం

**గడవువును 15 వరకు పొడిగించిన కాళోజీ వర్సిటీ**

**హైకోర్టులో పిటిషన్ దాఖలు..విచారణ నేటికి వాయిదా**

వరంగల్ (ప్రజా మంటలు): తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ (కాంపీటెంట్) కోటా కింద 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ తొలి విడత కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఆగస్టు 3న విడుదల చేసింది. ఆగస్టు 4న రిజిస్ట్రేషన్ పక్రియ ప్రారంభంకాగా.. 4 నుంచి ఆగస్టు 13తో గడువు ముగియాల్సి ఉంది. అయితే ఈ గడువును మరో రెండు రోజులు పెంచుతున్నట్లు కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ యూజీ రాష్ట్రస్థాయి ర్యాంకులకు ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 15న సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఃాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్లకు స్థానికత వివాదం మళ్లీ హైకోర్టుకు చేరింది. నిబంధనలను సవరిస్తూ రూల్–3ఎను చేర్చిన ప్రభుత్వం.. జులై 19న జీవో నెంబరు 33ను జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. మరికొందరు అత్యవసరంగా లంచ్ మోషన్‌లో విచారణ చేపట్టాలని కోరారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. గతేడాది హైకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం నిబంధనలను సవరిస్తూ జీవో తీసుకువచ్చిందని కోర్టుకు తెలిపారు. ప్రస్తుత నిబంధన ప్రకారం మెడికల్ సీట్ల ప్రవేశాలకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలని నిబంధన తీసుకువచ్చారన్నారు. సవరణ వల్ల స్థానికులకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాదించారు. మెడికల్, డెంటల్ కోర్సుల్లో అడ్మిషన్ల నిమిత్తం దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 13 చివరి తేదీ అని, అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రతివాదుల వాదన వినకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ప్రతివాదులైన వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ, ఎన్‌టీఏలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 14కు వాయిదా వేసింది. జీవో 33పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ గడువును కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆగస్టు 15 వరకు పొడిగించింది. ఎంబీబీఎస్ వెబ్‌కౌన్సెలింగ్‌లకు సంబంధించి కాళోజీ వర్సిటీ విడుదల చేసిన అభ్యర్థుల మెరిట్ జాబితాలో ఎంపికైనవారు మాత్రమే వెబ్‌కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. మెరిట్ జాబితాకు ఎంపికైన అభ్యర్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తెలంగాణలోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తం 49,143 మంది ర్యాంకులను ప్రకటించింది.

## రాందేవ్ బాబా, ఆచార్య బాలకృష్ణలకు ఊరట

**ధిక్కరణ కేసును మూసేసిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):యోగా గురు రామ్‌దేవ్ బాబా కు భారీ ఊరట లభించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను రూపొందించారని పతంజలి ఆయుర్వేద్ ఎండీ ఆచార్య బాలకృష్ణ, యోగా గురు బాబా రామ్‌దేవ్‌లపై నమోదైన ధిక్కరణ కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. ఈ ప్రకటనలకు సంబంధించి రామ్ దేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. కొవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై జస్టిస్ హిమా కోహ్లీ, అమానుల్లాతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పంతజలిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆరోపించిన తప్పుదోవ పట్టించే ప్రకటనలను పతంజలి ప్రింట్ మీడియాలో ప్రచురించింది. జనవరి 3, 2024న జరిగిన విచారణలో పతంజలిపై ధిక్కార చర్య తీసుకున్నందుకు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ధిక్కార నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో.. ఇద్దరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు కోరారు. ఆ క్షమాపణలను కోర్టు తిరస్కరించింది. తప్పుడు ప్రకటనలపై క్షమాపణలు కోరుతూ పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మళ్లీ 7న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పతంజలిని మందలించింది. ఆ తర్వాత విచారణలో బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి సర్వోన్నత న్యాయస్థానం మినహాయింపును ఇచ్చింది. అనంతరం మే 14న తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం.. నేడు తీర్పు వెలువరించింది. కోర్టు ధిక్కరణ కేసును ముగిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా న్యాయస్థానం హెచ్చరించింది.

# కేసులకు భయపడను

**- నాపై కేసును సీఎం దృష్టికి తీసుకెళ్తా**

**- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**



హైదరాబాద్ (ప్రజా మంటలు):
మరోవైపు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారని దానం తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు.. కానీ తాను మాత్రం లోకల్ అని పేర్కొన్నారు. నందగిరి హిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని ్ ÷ర్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. హైడ్రా అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నందగిరి హిల్స్ గురుబ్రహ్మ నగర్‌లో పేదల గుడిసెలు కూల్చివేసే అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పార్క్ స్థలం అని చెప్పి ఈవీడీఎం వాళ్లు పెద్ద ప్రహరీ గోడ కడుతున్నారని.. బస్తీ వాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారు? అని ప్రశ్నించారు. గోడ కట్టొద్దన్నందుకే ఈవీడీఎం అధికారులు తనపై కేసు పెట్టారని దానం తెలిపారు. హైదరాబాద్‌ను హైడ్రా అధికారులకేమీ రాసివ్వలేదని.. ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తనపై 190 కేసులు ఉన్నాయని.. కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు.

**రంగంలోకి 'హైడ్రా'**

గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు, విపత్తు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా హైదరాబాద్ డిజాస్టర్, రెస్పాన్స్ అండ్ అసెట్స్ కు అవసరమైన ఆఫీసర్లు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. 259 మంది ఆఫీసర్లు,సిబ్బందిని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒక్క ఐపీఎస్, ముగ్గురు గ్రూప్ 1 స్థాయి ఎస్పీలు,5 మంది డిప్యూటీ స్థాయి సూపరింటెండెంట్లు, 21 మంది ఇన్స్పెక్టర్లు,33 మంది సబ్ ఇన్ స్పెక్టర్లు,5 మంది రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు,12 మంది రిజర్వ్ ఎస్ఐలు, 101 మంది కానిస్టేబుల్స్,72 మంది హోంగార్డ్స్,6 మంది అనలిటికల్ ఆఫీసర్లను కేటాయిస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. 3500 మంది అవసరమని హైడ్రా కమిషనర్ ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హైడ్రాకు ఛైర్మన్ గా సీఎం రేవంత్ రెడ్డి, కమిషనర్‌గా రంగనాథ్ ఉన్నారు. 2,500 చదరపు కిలో మీటర్ల పరిధి ఉన్న హైడ్రాకు త్వరలోనే ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటవుతుందని రంగనాథ్ వెల్లడించిన సంగతి తెలిసిందే.. ఈ పోలీస్ స్టేషన్ ద్వారానే ఎస్వోటీ ఏర్పాటు చేసి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెడ్తామన్నారు. హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉందని చెప్పారు. పార్క్ స్థలాలను కాపాడే కాలనీ సంఘాలకు మద్దతిస్తామన్నారు. హైడ్రాకు మొత్తం 3,500 మంది సిబ్బంది అవసరమని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. హైడ్రా కింద అసెట్ ప్రొటెక్షన్‌తోపాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కూడా కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో 72 టీమ్స్?ను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. ఇదిలావుంటే గ్రేటర్‌లో ఆపరేషన్ హైడ్రా కొనసాగుతోంది. మంగళవారం నాడు జీహెచ్ఎంసీలో చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించ నున్నట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఉప్పల్ నల్ల చెరువులో జరుగుతున్న కబ్జాల గురించి వివరించిన విషయం తెలిసిందే. దీంతో రంగనాథ్ మంగళవారం ఉప్పల్లోని ఎమ్మెల్సీ తీన్ మార్ మల్లన్న, పరమేశ్వర్ రెడ్డి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్లచెరువును పరిశీలించారు. నల్ల చెరువులో కబ్జాలను, ఆక్రమణలు పూర్తిగా తొలగించడంతో పాటు చెరువు పరిరక్షణ కోసం హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. చెరువులను, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

# మరోసారి వాయిదా

**- వినేశ్ ఫొగాట్ పిటిషన్‌పై తీర్పును 16కు వరకు పొడగించిన 'కాస్'**

పారిస్ (ప్రజా మంటలు):
పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వేసిన పిటిషన్‌పై తీర్పు మరోసారి వాయిదా పడింది. ఈ వ్యవహారంపై తీర్పును కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్) ఈ నెల 16కు వాయిదా వేసింది. ఇప్పటికే వాదనలు విన్న కాస్.. శుక్రవారం తీర్పు వెల్లడించాలని నిర్ణయించింది. వినేశ్ వ్యవహారంపై కాస్ తీర్పు వాయిదా పడటం ఇది మూడోసారి. ఈ తీర్పు భారత్‌కు అనుకూలంగా వస్తే వినేశ్‌కు రజత పతకం ఇవ్వాల్సి ఉంటుంది. ఒలింపిక్స్ 50 కేజీల విభాగంలో అదిరే విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన వినేశ్.. 100 గ్రాముల బరువు ఎక్కువ ఉన్న కారణంగా స్వర్ణ పోరులో తలపడేందుకు అనర్హురాలిగా ప్రకటించడం యావత్ క్రీడా ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వినేశ్ తరఫున వాదించిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులలో ఒకరైన విదుష్పత్ సింఘానియా మీడియాతో మాట్లాడారు. "ఇది మాకు చాలా కష్టమైన పని. ఎందుకంటే మా అభిప్రాయాలను సిద్ధం చేయడానికి, వాటిని కాస్ ముందుంచడానికి మాకు చాలా తక్కువ సమయం దొరికింది. కానీ, మేము కష్టపడి పనిచేసి వినేశ్ కోసం పోరాడటానికి సన్నద్ధమయ్యాం. సాధారణంగా కాస్ 24 గంటల్లో తీర్పు ఇస్తుంది. ఈసారి వారు తీర్పు గడువును ఒకటి కంటే ఎక్కువసార్లు పొడిగించారు. నిర్ణయం భారత్‌కు అనుకూలంగా వస్తుందని మేమందరం ఆశిస్తున్నాం. తీర్పు ఇచ్చే అడ్‌హక్ ప్యానెల్ 24 గంటల కాలపరిమితిని కలిగిఉంది. దీన్నిబట్టి ఈ అంశం గురించి ప్యానెల్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు అర్థమవుతోంది. న్యాయమూర్తి మహిళ అయితే మాకు మరింత మంచిది. గతంలో నేను చాలా కేసులు వాదించాను. ఇక్కడ సక్సెస్ రేటు చాలా తక్కువ. వినేశ్ ఫొగాట్ విషయంలో చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరుతున్నాం. ఇది కొంచెం కష్టమే అయినా ఏదైనా అద్భుతం జరగాలని ఆశిద్దాం. వినేశ్‌కు పతకం దక్కాలని అందరూ ప్రార్థించండి. ఒకవేళ మెడల్ రాకపోయినా ఆమె ఛాంపియనే" అని విదుష్పత్ సింఘానియా పేర్కొన్నారు.తీర్పు వెలువడనున్న నేపథ్యంలో వినేశ్ ఇంకా స్వదేశానికి బయలుదేరలేదు. త్వరలో ఆమె భారత్‌కు వచ్చే అవకాశముంది. సోమవారం తన లగేజీని తీసుకొని ఒలింపిక్ క్రీడాగ్రామం నుంచి వినేశ్ బయటికి వచ్చేసింది.

# పేర్లు మార్చి ఖర్చు పెంచేశారు

**- ప్రాజెక్టుల కోసం రూ.1.81 లక్షల కోట్లు వెచ్చించినా ఫలితం నామమాత్రమే**

**- నీటిపారుదల శాఖను గాడిలో పెడుతున్నాం**

**- గత ప్రభుత్వం కమీషన్ల కోసం రీ డిజైన్ చేసింది - మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

హైదరాబాద్ (ప్రజా మంటలు):



రాష్ట్రంలో నీటిపారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి.. నామమాత్రంగా ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. కమీషన్ల కోసం ప్రాజెక్టులకు పేర్లు మార్చి రీ డిజైన్ చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జలసౌధలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు 3 పంపులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026 ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.27 వేల కోట్లు, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,436 కోట్లు ఖర్చు చేసిన అప్పటి ప్రభుత్వం ఒక్క ఎకరాకీ నీళ్లు ఇవ్వలేదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా.. కల్వకుర్తి, నె÷-టటెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నాం. భారాస నేతలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. వై.ఎస్.ఆర్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టు చేపట్టారు. కానీ, భారాస హయాంలో కమీషన్ల కక్కుర్తి కోసం ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారు. ప్రాజెక్టు పూర్తి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతో రీడిజైన్ చేశారు. ప్రాజెక్టుల పేర్లు మార్చి, ఖర్చు నాలుగింతలు చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. కాంగ్రెస్ చేపట్టిన రాజీవ్, ఇందిరా ఎత్తిపోతలకు సుంకిశాలగా పేరు మార్చి రీ డిజైన్ చేశారని చెప్పారు. రాజీవ్, ఇందిరా ప్రాజెక్టులతో 2 వేల కోట్లతో 6 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవన్నారు. 19 వేల కోట్లతో సీతారామ నిర్మించారని....కమీషన్ల కక్కుర్తితో సీతారామ ఎస్టిమేషన్ ను పెంచారని ఆరోపించారు ఉత్తమ్. బీఆర్ఎస్ హయాంలో సీతారామ కాల్వలకు భూసేకరణ కూడా చేయలేదన్నారు ఉత్తమ్. సీడబ్ల్యూసీ పర్మిషన్ తామే తెచ్చామని కేటీఆర్ చెబుతున్నాడు..కానీ.. ఈ రోజు వరకు సీడబ్ల్యూసీ పర్మిషన్ పూర్తి స్తాయిలో రాలేదన్నారు. బీఆర్ఎస్ వి అన్నీ అబద్ధపు ప్రచారాలేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామన్నారు. సీతారామ మోటర్లు బిగించింది తామేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులకు లక్షా 81 వేలు ఖర్చు చేశారని చెప్పారు ఉత్తమ్. బీఆర్ఎస్ పాలనలో ఇరిగేషన్ ను ఆగం చేశారని మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టే పనిలో ఉన్నామన్నారు. కావాలనే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంలో లక్ష కోట్లు ఖర్చు చేసినా ఎకరాకు నీళ్లియ్యలేదన్నారు. పదేళ్లు తూతూ మంత్రంగా పని చేశారని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి పెండింగ్ ప్రాజెక్టులు కూడా పూర్తి చేయలేదన్నారు. తాము పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉత్తమ్ చెప్పారు.

# భారత శాశ్వత సభ్యత్వం వ్యవహారం..

**మళ్లీ పాక్, చైనా మోకాలడ్డు**



న్యూయార్క్ (ప్రజా మంటలు):
ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను పరిష్కరించాలంటే ఐక్యరాజ్య సమితి (జనితిబివట ఔజీబితినీనిబ) భద్రతా మండలిలో సంస్కరణలు అవసరమని భారత్ పునరుద్ఘాటించింది. ఈసందర్భంగా న్యూదిల్లీకి శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. భద్రతా మండలిని విస్తరించాలని, అందులో ఆఫ్రికా, ఆసియా-పసిఫిక్ దేశాలకు సభ్యత్వం కల్పించాలని సూచించింది. అయితే, దీన్ని చైనా , పాకిస్థాన్‌లు వ్యతిరేకించాయి. అంతర్జాతీయ శాంతిభద్రతల నిర్వహణ అంశంపై ఐరాస భద్రతా మండలిలో ఉన్నతస్థాయి చర్చ జరిగింది. ఇందులో జీ4 (భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ) దేశాల తరఫున భారత ప్రతినిధి ఆర్.రవీంద్ర కీలక ప్రసంగం చేశారు. "ఐరాస భద్రతా మండలి (జఔఅ)ని 15 నుంచి 25-26కు పెంచాలి. మరో ఆరు శాశ్వత సభ్య దేశాలు, నాలుగు లేదా ఐదు తాత్కాలిక సభ్య దేశాలను మండలిలో చేర్చాలి. శాశ్వత సభ్యులుగా కొత్తగా చేర్చే ఆరింటిలో రెండు ఆఫ్రికా దేశాలు, మరో రెండు ఆసియా-పసిఫిక్ దేశాలు ఉండాలి. లాటిన్ అమెరికా/కరేబియా నుంచి ఒకటి.. పశ్చిమ యూరోపియన్ ప్రాంతం నుంచి ఒక దేశానికి శాశ్వత ప్రాతినిధ్యం కల్పించాలి. కొత్తగా చేర్చే శాశ్వత సభ్యులకు కూడా వీటో లాంటి అధికారాలు కల్పించాలి" అని రవీంద్ర సూచనలు చేశారు."ఐరాస భద్రతా మండలి చర్చల అజెండాలో 70శాతం ఆఫ్రికా దేశాల కోసమే ఉంటాయి. కానీ, మండలిలో దానికి శాశ్వత గళం వినిపించే అవకాశం లేకపోవడం విచారకరం. జీ20 లాంటి గ్రూప్‌ల్లోనూ ఆఫ్రికా యూనియన్‌కు పూర్తి సభ్యత్వం కల్పించాం. కానీ, ఐరాసలో ప్రాతినిధ్యం లేదు" అని ఆయన గుర్తుచేశారు. మండలికి సంస్కరణలు చేయకపోతే ఈ అంతర్జాతీయ సంస్థ ఉద్దేశాలు సఫలీకృతం కాబోవని అన్నారు. అయితే, భారత్ వ్యాఖ్యలతో పాక్, చైనా విభేదించాయి. "ఆఫ్రికాను ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. మండలిలో దానికి దీర్ఘకాల సభ్యత్వం ఇవ్వాలి. అయితే, అందుకోసం భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాల సంఖ్యను పెంచాల్సిన అవసరం లేదు" అంటూ ఐరాసకు పాక్ శాశ్వత ప్రతినిధి మునీర్ అక్రమ్ అక్కసు వెళ్లగక్కారు. అటు చైనా ప్రతినిధి ఫు కాంగ్ మాట్లాడుతూ.. "కొన్ని దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మండలి విస్తరణ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి" అంటూ న్యూదిల్లీపై పరోక్షంగా నోరుపారేసుకున్నారు. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా భద్రతా మండలి ఏర్పడి ఏడున్నర దశాబ్దాలు దాటిపోయింది. 53 దేశాలతో ప్రారంభమైన ఐరాసలో ఇప్పుడు సభ్యదేశాల సంఖ్య 193కు చేరింది. ఇన్నేళ్లలో భద్రతా మండలిని ఒకే ఒక్కసారి 1965లో విస్తరించారు. దాంతో మండలి సభ్యదేశాల సంఖ్య 15కు చేరింది. ఇందులో వీటో అధికారం కలిగిన శాశ్వత సభ్యదేశాలుగా అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లే నేటికీ కొనసాగుతున్నాయి. మిగతా 10 తాత్కాలిక సభ్య దేశాలు రొటేషన్ పద్ధతిపై మారుతుంటాయి.



# కమ్ముకున్న యుద్ధమేఘాలు

**- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఏ క్షణాన్నైనా దాడి చేసే అవకాశం**

**- వైట్‌హౌస్ హెచ్చరిక**

వాషింగ్టన్ (ప్రజా మంటలు):
హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యతో ఇజ్రాయెల్-ఇరాన్ ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ ఉద్రిక్త పరిస్థితులు ఎప్పుడైనా యుద్ధంగా మారొచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి. రానున్న రోజుల్లో ఇరాన్ లేక దానికి మద్దతిస్తున్న సంస్థలు ఇజ్రాయెల్‌పై దాడి చేసే అవకాశం గణనీయంగా పెరుగుతోందని వైట్‌హౌస్ హెచ్చరించింది. ఈ వారంలోనే దాడి జరగొచ్చని అప్రమత్తం చేసింది. నిఘా వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బీ ఆమేరకు ప్రకటించారు. మరోవైపు ఈ ప్రతీకార దాడుల్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ పూర్తి సంసిద్ధతతో ఉందని తెలుస్తోంది. టెహ్రాన్‌లో హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా హత్యానంతరం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన సంగతి తెలిసిందే. హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో తమ అత్యంత సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ మృతి చెందారని హెజ్‌బొల్లా వెల్లడించింది. హనియా హత్య ఇరాన్ గడ్డపై జరిగింది. దాంతో ఇరాన్, హమాస్, హెజ్‌బొల్లా.. ఇజ్రాయెల్‌పై విరుచుకుపడేందుకు సిద్ధంగా ఉన్నాయన్న అంచనాలతో పశ్చిమాసియా నివురుగప్పిన నిప్పులా ఉంది. ఈ తరుణంలో అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ నేతలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. కాస్త ఓర్పు వహించాలని ఇరాన్‌ను కోరాయి. ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ప్రయత్నాలకు మద్దతు ఇస్తూ ఆ ప్రకటన చేశాయి. సైనికపరమైన ఉద్రిక్తతలను నియంత్రించాలంటూ బ్రిటన్ ప్రధాని, జర్మనీ ఛాన్సలర్.. ఇరాన్ కొత్త అధ్యక్షుడిని సంప్రదించాయి. మరోవైపు ఈజిప్టు, ఖతర్ మధ్యవర్తిత్వంతో జరుగుతోన్న కాల్పుల విరమణ చర్చలు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. అయితే ఇరాన్ దాడి చేస్తే.. ఆ చర్చలు ఆలస్యం కావొచ్చని వైట్‌హౌస్ ప్రతినిధి అభిప్రాయపడ్డారు. ఇక, హెజ్‌బొల్లా స్థావరాలున్న లెబనాన్‌పై ఎయిర్ పెట్రోలింగ్ చేస్తున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. అలాగే ముప్పుగా భావిస్తోన్న లక్ష్యాలపై దాడులు చేస్తోంది. పరిస్థితుల తీవ్రతను గుర్తించిన అమెరికా పశ్చిమాసియాకు అణు జలాంతర్గామిని పంపుతున్నట్లు ప్రకటించింది. అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్.. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గలాంట్‌తో ఆదివారం రెండుసార్లు ఫోన్లో మాట్లాడారు. ఇజ్రాయెల్ రక్షణకు అగ్రరాజ్యం కట్టుబడి ఉందని ఆస్టిన్ తెలిపారు.

## తెలంగాణ డీఎస్సీ ప్రిలిమినరీ కీ విడుదల..

హైదరాబాద్ (ప్రజా మంటలు):
తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రాథమిక కీ విడుదలైంది. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, సెకెండరీ గ్రేడ్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా కీ, రెస్పాన్స్‌షీట్లను పాఠశాల విద్యాశాఖ అధికారులు తమ అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు కీపై అభ్యంతరాలను ఆగస్టు 20వరకు తెలపవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్టు 5వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు 2,45,263 మంది హాజరయ్యారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు ఇస్తే ఇళ్ల మంజూరుకు కేంద్రం సిద్ధం - కిషన్‌రెడ్డి

హైదరాబాద్ (ప్రజా మంటలు):



రాష్ట్రంలో సొంతిళ్లు అవసరం ఉన్న పేదల జాబితాను కేంద్రానికి అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల కోసం నిర్వహించనున్న సర్వేలో పాల్గొనాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. కనీసం 10 కోట్ల మందికి లబ్ధిని చేకూర్చాలని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ పథకం ఫలాలను ఆయా కుటుంబాలకు అందించి వారి సొంతింటి కలను సాకారం చేయడంలో సంపూర్ణ సహకారం అందిస్తారని కోరుకుంటున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్రమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి ప్రధామంత్రి ఆవాస్ యోజన- గ్రామీణ పథకం ఫలాల విషయంలో లేఖ రాసారు. గ్రామీణ భారతదేశంలోని ప్రతి ఒక్కరు సొంతింటి కలను సాకారం చేయడానికి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాన్ని 2016 లో ప్రారంభించిందని తెలిపారు. పథకం ప్రారంభ సమయంలో గ్రామీణ భారతదేశంలోని సొంతిల్లు లేని పేద కుటుంబాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మార్చి 2024 నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని వివరించారు. మొదటి విడత గడువు ముగిసిన ఈ పథకాన్ని కొనసాగిస్తూ రెండవ విడతలో భాగంగా ఏప్రిల్ 2024 నుండి మార్చి 2029 మధ్య కాలంలో మరో 2 కోట్ల పక్కా ఇళ్లను సొంతిల్లు అవసరమున్న గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు నిర్మించి ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. తద్వారా కనీసం 10 కోట్ల మందికి లబ్ధిని చేకూర్చాలని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా గత కొన్ని దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేసిన అనేక పర్యటనలలో సొంతిల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని చాలా మంది పేదలు కోరినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని ఈ నెల 9న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ప్రధానమంత్రి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ప్రతిపాదనలు వస్తే ఇళ్లను కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com


-ఎడిటర్

# వ్యవసాయ రంగానికి సుబ్బారావు ఎనలేని సేవలు

**ఆగస్టు 14....ఈడుపుగంటి వెంకట సుబ్బారావు వర్ధంతి**



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



పద్మశ్రీ ఈడుపుగంటి వెంకట సుబ్బారావు (డిసెంబర్ 20, 1934 %-% ఆగష్టు 14, 2010) ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త. ఐ.వి. సుబ్బారావుగా అయన సుపరిచితులు. సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపం లోని పసలపూడి గ్రామం లో జన్మించారు. ఆయ న తల్లిదండ్రులు అచ్చన్న, మున్నెమ్మ. ఆంధ్ర విశ్వ విద్యా లయం నుండి అగ్రికల్చర్ లో మాస్టర్ డిగ్రీ ఎం.ఎస్.సి. చేశారు. ఇండియన్ అగ్రికల్చ రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, న్యూఢిల్లీ నుండి పి. హెచ్. డి.పొందారు. ఆయన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ బాధ్యతలు చేపట్టే ముందు విశ్వ విద్యాలయంలో పరిశోధ న డైరక్టర్ గా ఉన్నారు. ఆచా ర్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యా లయం ఉపకుల పతిగా వరుసగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించి 2003 లో పదవీ విరమణ చేశారు. ఎందరో యువ శాస్త్రవేత్తలకు మార్గ దర్శకులై, పరిశోధనా రంగంలో ప్రోత్సహించి, కొత్త ఆవిష్కారాలకు తెర లేపారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం, సుబ్బారావు ఆధ్వర్యంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించి, దేశంలోనే, దీనిని నిర్వహించిన మొదటి వ్యవసాయ విశ్వ విద్యాల యంగా పేరు తెచ్చు కొన్నది. ఆయన 2006 లో నిర్వ హించిన 93 వ కాంగ్రెస్ కు జనరల్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. ఆయన 75 సంవత్సరాల వయస్సులో 2010 ఆగష్టు 14 న క్యాన్సర్ వ్యాధితో మరణించారు.

సుబ్బారావు వ్యవసాయ రంగానికి చేసిన ప్రముఖ సేవలకు 2002 లో భారత ప్రభుత్వం నుండి పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు. బోర్‌లోగ్ అవార్డు (2004), అశు తోష్ ముఖర్జీ స్మారక అవార్డు (2007)ను సుబ్బారావు సొంతం చేసుకున్నారు.

## యువతలో మార్పు కోసం.. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

నేటి సమాజంలో యువత ఎక్కువగా మత్తు పదార్థాలు, మద్యంకు బానిసలుగా మారుతూ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు, మత్తు పదార్థాలకు బానిసలుగా మారి నేర ప్రవృత్తి వైపు ఆలోచనలు చేస్తూ అనేక నేరాలకు పాలుపడుతున్నారు, ఇటు కుటుంబం చిన్న బిన్నం అవుతుంది, అటు వ్యవస్థను కలుషితం చేస్తున్నారు, చట్టాలు, వ్యవస్థలు యువతలో మంచి మార్పులు తీసుకరాలేక పోతున్నాయి. నేటి యువత ఆలోచనలకూ అనుగుణంగా చట్టాలలో మార్పులు చేయకపోవడం కూడా ఒక ప్రధాన కారణం. మార్పులను స్వీకరించి అమలు చేయకపోతే విద్యావ్యవస్థ పతనానికి దారితీస్తుంది. ప్రతి కాలేజీలో నెలకు ఒక్కసారి చెడు అలవాట్ల మీద, భవిష్యత్తు పట్ల ఉండాల్సిన బాధ్యతల పట్ల అవగాహనా సదస్సులు నిర్వహించాలి, అలానే ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని కాలేజీలు, యూనివర్సిటీలను స్థానిక పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తే కొంత వరకు సత్ఫలితాలను పొందే అవకాశం ఉంటుంది. ఇంకా ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటర్ నుంచి పి. జి స్థాయి కాలేజీల వరకు ప్రతి సంవత్సరం ప్రతి విద్యారికి ఎక్కడ విద్యను అభ్యసిస్తున్నాడో అదే ప్రాంగణంలో రక్త నామూలలను సేకరించి విద్యార్థి ఎలాంటి మత్తు పదార్తాలు లేదా మద్యం సేవించాడా చెడు వ్యసనాలకు అలవాటు పడడ్డా అనేవిషయాల మీద మెడికల్ చెకప్ చేయడం వలన ప్రతి విద్యార్థి చెడు మార్గాలవైపు వెళ్లకుండా నిరోధించడానికి అవకాశం ఉంటుంది. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు అయితే ఆ విద్యాసంవత్సరం చదవకుండా నిరోధించాలి. మిగితా విద్యార్థులను కాపాడినట్టు అవుతుంది. మెడికల్ చెకప్ చేయడం వలన అటు తల్లి దండ్రులకు పిల్లల ఆరోగ్యం విషయం తెలుస్తుంది, ఇటు ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుంది. ఏమైనా కాలేజీలలో లోపాలు ఉంటే ప్రభుత్వ దృష్టికి వస్తుంది. చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. మంచి మార్పులను స్వీకరించగలగాలి.

డాక్టర్. వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్.

## ఏసీబీకి చిక్కిన రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్

హైదరాబాద్:(ప్రజామంటలు):
రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) భూపాల్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు. ఆయనతో పాటు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు.ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపునకు జాయింట్ కలెక్టర్ రూ.8 లక్షల లంచం డిమాండ్ చేశారు. డబ్బును సీనియర్ అసిస్టెంట్ ద్వారా జేసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి జేసీ, సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారు. మరోవైపు నాగోల్‌లోని జేసీ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేసిందని కొనియాడారు.

### ఇప్పలపల్లి గురుకుల పాఠశాలలో ఏసీబీ ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 13 (ప్రజామంటలు):
రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం ఉదయం ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పాఠశాల రికార్డులతో పాటు వంట గదులు ఫుడ్ ఐటమ్స్ తనకి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీలలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఉన్నత అధికారులు ఆదేశం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. గతంలోనూ గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు, ఫుడ్ మెనూ సరిగ్గా పాటించడం లేదనే ఆరోపణ రావడం గమనార్హం.

# మాన్‌స్టర్ వెళ్లిపోయింది

**- హసీనాపై తాత్కాలిక ప్రధాని యూనస్ వ్యాఖ్య**

**- బంగ్లా అల్లర్లలో మా ప్రమేయం లేదు: అమెరికా**

ఢాకా (ప్రజామంటలు): బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ (84) మాజీ ప్రధాని షేక్ హసీనాను ఉద్దేశించి మాన్‌స్టర్ వెళ్లిపోయింది అంటూ వ్యాఖ్యానించారు.తాత్కాలిక ప్రభుత్వ సారథిగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆందోళనలను ముందుండి నడిపించిన విద్యార్థి సంఘాల నాయకులను ప్రశంసించారు. ఇప్పటికే విద్యార్థి సంఘం నాయకులు నహిద్ ఇస్లాం, ఆసిఫ్ మహ్మద్‌లను 16 మంది సభ్యుల సలహా మండలిలో చేర్చుకున్నామన్నారు. ”విద్యార్థుల నేతృత్వంలో ప్రారంభమైన విప్లవం మొత్తం ప్రభుత్వాన్నే కూల్చేసింది. నిరంకుశ పాలనకు ముగింపు పలికింది. దేశం నుంచి మాన్‌స్టర్ వెళ్లిపోయింది. మిమ్మల్ని నేను గౌరవిస్తాను. మీరు తాత్కాలిక పరిపాలన బాధ్యతలు తీసుకొమ్మని కోరినందు వల్లే అంగీకరించాను” అని ఆయన పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తిగా సయ్యద్ రెఫాత్ అహ్మద్ పేరును విద్యార్థి నాయకులు ప్రతిపాదించడంతో ఆయనను కొత్త ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు.బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఐటీశాఖ మాజీ మంత్రి జునైద్ అహ్మద్ పలక్‌ను, విదేశాంగ మాజీ మంత్రి హసన్ మహమూద్‌ను అధికారులు ఢాకా విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. బంగ్లాదేశ్ సైన్యంలో మేజర్ జనరల్‌గా ఉన్న జియావుల్ అహ్‌సాన్‌పై వేటుపడింది. లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ సైఫుల్ అలాంను విదేశాంగ మంత్రిత్వశాఖకు బదిలీ చేశారు. హసీనా కంటే ముందే పలువురు నేతలు దేశం వీడి వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం హసీనా భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు.

మా ప్రమేయం లేదు: అమెరికా

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం వదిలి వెళ్లడానికి దారి తీసిన పరిస్థితుల్లో అమెరికా ప్రమేయం ఉందంటూ వస్తున్న ఆరోపణలను వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరీన్ జీన్-పియర్ ఖండించారు. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు. తమపై వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదన్నారు.

షేక్ హసీనాపై హత్య కేసు..!

కల్లోలిత బంగ్లాదేశ్‌లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే మరో కీలక పరిణామం చోటుచేసుకొంది. ప్రధాని పదవిని వీడి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా పై హత్య కేసు నమోదైంది. ఆమెతో పాటు మరో ఆరుగురిపైనా ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్ ను నిప్పుల కుంపటిలా మార్చింది. ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో వందల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు ఆ సంఖ్య 550కి పైగా చేరుకుంది. ఈ క్రమంలోనే మొహమ్మద్‌పుర్‌లోని ఓ కిరాణ దుకాణ యజమాని అబుసయ్యద్ కూడా మరణించాడు. అతడి మరణానికి మాజీ ప్రధాని (ఃజీనిణశ్రీజీటవబష్ట్ర'బ ఈనీతీఎవతీ ఖతీతిఎవ ఓతినితిబబివతీ) షేక్ హసీనానే కారణమని ఆరోపిస్తూ సయ్యద్ సంబంధికుల్లో ఒకరు ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆమెతో పాటు మరో ఆరుగురిపైనా కేసు నమోదైంది. నిందితుల్లో అవామీ లీగ్ పార్టీ జనరల్ సెక్రటరీ ఒబైదుల్ క్వాదర్, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజీ అబ్దుల్లా అల్ మామున్ సహా మరికొందరు ఉన్నారు.కాగా.. రిజర్వేషన్లకు వీడ్కోలు పలికి ప్రతిభకు పట్టం కట్టాలంటూ విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. నిరసనలు హింసాత్మకంగా మారడంతో బంగ్లాదేశ్ అగ్నిగుండంలా మారింది. అవామీ లీగ్ నేతృత్వంలోనే ప్రభుత్వం కూలిపోయింది. దీంతో షేక్‌హసీనా రాజీనామా చేసి దేశాన్ని వీడారు. ప్రస్తుతం ఆమె భారత్ లో ఆశ్రయం పొందుతున్నారు. ఈ క్రమంలోనే బంగ్లాలో సైన్యం తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఆమె అక్కడున్నంత మాత్రాన భారత్‌తో తమ ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినవని తాత్కాలిక ప్రభుత్వం పేర్కొంది.అయితే.. నోబెల్ గ్రహీత, బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణం అనంతరం హసీనాను ఉద్దేశిస్తూ ఆమె దేశం నుంచి మాన్‌స్టర్ వెళ్లిపోయిందంటూ వ్యాఖ్యానించారు. విద్యార్థి నాయకులు ప్రతిపాదించడంతో ప్రధాన న్యాయమూర్తిగా సయ్యద్ రెఫాత్ అహ్మద్‌ను నియమించారు.



## ఆలయంలో సాంప్రదాయాలకు వ్యతిరేకంగా వ్యవహరించవద్దు..

రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 13 (ప్రజామంటలు):
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.ఆలయ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా చేయవద్దని మంగళవారం ఆల ఈవోకు భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ అధికంగా ఉందనే నెపంతో శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడిబియ్యంను అమ్మవారి ముందర కాకుండా బయట ఒడిబియ్యం సమర్పించాలని దేవాలయ అధికారులు నిర్ణయం సరయినది కాదన్నారు. వందల సంవత్సరాల నుండి వస్తున్న సాంప్రదాయాలను పక్కకు పెట్టడంను మేము వ్యతిరేకిస్తున్నమని,ఈ విషయంపై ఆలయ ఈవోతో మాట్లాడడం జరిగిందని, గతంలో లాగా భక్తులు ఒడిబియ్యం అమ్మవారి ముందు పోసేందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట భాజపా పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, పిన్నింటి హనుమాన్లు , ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల మైండ్‌గేమ్!

తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్‌కు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌కు కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఎంతవరకు అన్నది తేలడం లేదు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచిలు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొందపెట్టడమే లక్ష్యంగ కాంగ్రెస్ బిజెపిలు పావులు కదుపుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. అధికారంలో లేకున్నా ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా నిలబడి తిరిగి అధికారం దక్కించుకుంది. పదేళ్లు అధికారంలో ఉన్నా కుటుంబ పాలన వల్ల బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనేక అక్రమాలను మూటకట్టుకుంది. అవే ఇప్పుడు యమపాశాలై వెన్నాడుతున్నాయి. ఓటమి తరవాత ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైసిపి ఒకే తరహా డ్రామాలు ఆడుతున్నాయి. ఎమ్మెల్యేలను లేదా ఎంపిలను లేదా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చేర్చుకోవడంలో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు ఆధిపత్యం లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ సీట్లు గెలిస్తేనే.రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న ప్రచారం, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేసీఆర్ రంగంలోకి దిగాలని కోరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా వ్యవహ రిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసెంబ్లీ ద్వారా వచ్చిన అవకాశాన్ని కెసిఆర్ వదులుకున్నారు. రైతుల పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని చెప్పేందుకు జిల్లా యాత్రలు చేపట్టి. రైతులను పరామర్శించినా లాభ ం లేకుండా పోయింది. ఇప్పుడు రుణమాఫీతో రైతుల్లో మళ్లీ కాంగ్రెస్ పట్ల ఆదరణ పెరగింది. బీఆర్ఎస్ పార్టీతోనే రైతులకు లాభం జరుగుతుందని కెసిఆర్ ఎ న్నికల ముందు యాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల తరవాత మాతో 20మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీరాలు పలికి 10 మంది ఎమ్మెల్యేలను అప్పగించింది. అందుకే కెసిఆర్ తనముందున్న అన్ని అస్త్రాలను ఉపయోగించాలని చూస్తున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ గెలుపు అంతా సీఎం రేవంత్ రెడ్డి తన భుజాల మీద వేసుకుని 8 ఎంపి స్థానాలు గెలుచుకున్నారు. బిఆర్ఎస్‌ను పూర్తిగా దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీకి మళ్లీ మోదీ క్రేజీ గెలుపు తో దూకుడు మీద ఉంది. అయితే ఆ పార్టీలో కూడా అధ్యక్ష పదవి కోసం ఇప్పుడు కుమ్ములాటలు సాగుతున్నాయి. గులాబీ పార్టీని నిలుపుకునేందుకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగుతారని అనుకుంటున్నా..ఆయన సైలెంట్‌గా ఉన్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ బిజెపిలో విలీనం అవుతుందన్న ప్రచారం కూడా దెబ్బతీస్తోంది. దీని కోసం అన్ని పార్టీలు మైండ్ గేమ్ స్టార్ట్ చేశాయి. ప్రత్యర్థి పార్టీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కాంగ్రెస్ మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బిజపి, బిఆర్ఎస్‌లు ప్రచారం చేస్తున్నా అది పెద్దగా ప్రజలు

పట్టించుకునే స్థాయిలో లేదు. స్థానిక ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని జోస్యం చెబుతోంది. అయితే ఈ మూడు పార్టీలు తమదైన శైలిలో మానసిక యుద్ధానికి తెర లేపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకోగా, మిత్రపక్షం సీపీఐ ఒక స్థానంలో గెలిచింది. దీనికితోడు సిఎం రేవంత్‌రెడ్డి తీరుపై సానుకూల దృక్పథం రోజురోజుకూ బలపడుతోంది. అన్నింటికి మించి దొరల పానలకు దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెక్ పెట్టిన బీఆర్ఎస్ మళ్లీ కోలుకోకుండా ఉండేందుకు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కింది స్థాయి బీఆర్ఎస్ క్యాడర్ లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతోంది. తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీనే తప్ప బీఆర్ఎస్ కాదని నేతలు చెబుతున్నారు. బిజెపి కూడా కాంగ్రెస్ తమ ప్రదాన ప్రత్యర్థిగా చెబుతోంది. అందుకే ఈ రెండు పార్టీలు బిఆర్ఎస్ లక్ష్యంగా విమర్శలకు పదను పెట్టాయి. బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా.. ఊడుతుందా అంటూ...పొలిటికల్ మైండ్ గేమ్‌తో అధికార కాంగ్రెస్‌ను డిఫెన్స్‌లోకి నెట్టేందుకు కమలం నేతలు కామెంట్స్ చేస్తున్నారు.

## గురుకులాలను ప్రక్షాళన చేస్తాం

# నిధులు సమకూరుస్తాం



- మంత్రులు, ఎమ్మెల్యేలు నెలకొక రోజు గురుకులాల పర్యటన
- గురుకుల భవన నిర్మాణాలకు బడ్జెట్లో 5 వేల కోట్లు
- గురుకుల భవన నిర్మాణాలను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం
- పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు తక్షణమే రూ. 50 లక్షలు మంజూరు
- గురుకుల విద్యార్థులకు మంచాలు బెడ్స్ ఉండాల్సిందే
- ప్రతిపాదనలు పంపితే నిధులు ఇస్తాం

జగిత్యాల ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

పెద్దాపూర్ లో విద్యార్థుల మృతి ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. పెద్దాపూర్ గురుకుల పాఠశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించినారు. కుమారులను కోల్పోయి కంటతడి పెట్టిన తల్లిదండ్రులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రి పొన్నం ప్రభాకర్ ఓదార్చినారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలను ప్రక్షాళన చేసి ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రతగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చుతామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. నెలలో ఒక రోజున రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు శాసనసభ్యులు గురుకుల పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో భోజనం చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు, డిఎంహెచ్వోలు సైతం నెలలో ఒక రోజున గురుకుల పాఠశాలలో బస చేయాలని సూచించారు. జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి మంగళవారం డిప్యూటీ సీఎం సందర్శించారు. గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థుల మృతి నలుగురు విద్యార్థుల అస్వస్థతకు సంబంధించిన కారణాల గురించి విద్యార్థులు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. తీవ్ర దుక్క సాగరంలో ఉన్న తల్లిదండ్రుల ఆవేదనను చూసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భావోద్వేగానికి గురయ్యారు. కంటతడి పెట్టుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను ఓదార్చిన అనంతరం వారితో సమావేశమయ్యారు అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో బడ్జెట్ పెట్టడానికి ముందు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులను తెలుసుకొని విద్యా, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ వార్షిక బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా గురుకుల పాఠశాలల పక్క భవనాల నిర్మాణం కోసం ఈ బడ్జెట్ లో ప్రజా ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయించిందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గత పాలకులు గురుకుల పాఠశాలల పక్కా భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించిందని మండిపడ్డారు. 2004 నుంచి 2014 వరకు ప్రభుత్వ హాస్టల్స్ లో చదివే విద్యార్థులకు హెల్త్ కార్డ్స్ ఉండేదనీ, ప్రతి నెల డాక్టర్లు వచ్చి వారి ఆరోగ్యాన్ని చెక్ చేసి కార్డులో రాసే వారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్టల్లో నే పారామెడికల్ స్టాఫ్ ఉండేవారని ఆ విధానాన్ని తిరిగి తీసుకురావాలని గురుకులాల సెక్రటరీని ఆదేశించారు.

**విద్యార్థుల డైట్ చార్జీల పెంపునకు కమిటీ వేస్తాం:**

పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచడానికి త్వరలోనే అధికారులతో కమిటీ వేస్తామని ప్రకటించారు. కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత డైట్ చార్జీలను పెంచుతామని వెల్లడించారు. గురుకుల పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి నేలపైన పడుకోవడానికి వీలులేదని కచ్చితంగా మంచం, బెడ్, బెడ్ షీట్ ను ప్రభుత్వ సమకూర్చుతుందని ఇందుకోసం ప్రతిపాదనలు పంపితే నిధులు విడుదల చేస్తామని గురుకులాల సెక్రటరీ రమణ కుమార్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి గురుకులంలో అత్యవసర ఔషధాలు, పారా మెడికల్ స్టాఫ్, కుక్కకాటు, పాముకాటుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గురుకులాల సెక్రెటరీని ఆదేశించారు. శుచి, శుభ్రత పాటిస్తూ నాణ్యత గల ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రతి గురుకుల పాఠశాలలో టాయిలెట్స్, బాత్రూమ్స్ విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సమృద్ధిగా నీరు, విద్యుత్తు, గురుకుల పాఠశాలకు కావలసిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈజీఎస్ పనుల కింద గురుకుల పాఠశాలలో చెత్తా, చెదారం పిచ్చి మొక్కలు తొలగించి, పండ్లు, ఔషధ మొక్కలు నాటించాలని చెప్పారు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

**పెద్దాపూర్ పాఠశాలకు 50 లక్షలు మంజూరు:**

పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో నీటి కుంటలు, చెత్తాచెదారం లేకుండా అభివృద్ధి చేయడానికి, టాయిలెట్స్ నిర్మాణం కోసం ఇతర సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూపాయలు 50 లక్షలు మంజూరు చేశామన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డార్మీటరీ, డైనింగ్ హాల్స్, భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించిన వెంటనే ఒక్కరోజు ఆలస్యం చేయకుండా నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. 12 ఎకరాలు ఉన్న పెద్దాపూర్ పాఠశాలలో భవన నిర్మాణం కోసం 2020-21 వార్షిక సంవత్సరంలో నిధులు మంజూరు చేసి విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులను ఆపి వేసినట్లు అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసిన వెంటనే ఆ నిధులు మా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని, నీటి కుంటలు చెత్తాచెదారం లేకుండా చూడాలని కలెక్టర్ ను ఆదేశించినట్లు చెప్పారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండ:

మృతి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలకు ఎక్స్రేషియా తో పాటు గురుకుల సొసైటీలో వారి విద్యా అర్హతకు అనుగుణంగా ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఇల్లు లేకుంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్టు చెప్పారు. మృతి చెందిన విద్యార్థుల పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత దాని ఆధారంగా విచారణ ఉంటుందన్నారు.



### మాజీ సర్పంచ్ కు నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామం మాజీ సర్పంచ్ పోల్నేని రాజేశ్వర్ రావు మొదటి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్, సీనియర్ నాయకులు కడారి రాజు, కుర్ర సాంబమూర్తి గౌడ్, మదన్ మోహన్ రావు, కోరే రాజ్ కుమార్, సుర సాంబరాజు, తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## ఎన్నికల్లో ఓడితే ఆ దేశానికి వెనిజులా వెళ్లిపోతా

**- మస్క్తో ఇంటర్వ్యూలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

వాషింగ్టన్ ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలోనే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ను ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు. ఇందులో మాజీ అధ్యక్షుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నవంబరులో జరిగే ఎన్నికల్లో ఓడిపోతే.. దేశాన్ని వీడతానంటూ తన ప్రణాళికలను బయటపెట్టారు."ఈ ఎన్నికల్లో ఏదైనా జరిగితే.. పరిస్థితి ఘోరంగా ఉంటే (తన ఓటమిని ఉద్దేశిస్తూ) మనం మళ్లీ వెనెజువెలాలో కలుద్దాం. మన భేటీకి అమెరికా కంటే సురక్షితమైన ప్రదేశం అదే. అందుకే నేను అక్కడికి వెళ్లిపోతా. మీరూ రండి. మనం సమావేశమవుదాం. డిన్నర్ చేద్దాం" అని మస్క్కు ట్రంప్ చెప్పారు. వెనెజువెలాలో ప్రమాదకరమైన నేరస్థులను కూడా జైళ్ల నుంచి విడుదల చేసి అమెరికాకు అక్రమంగా వలస పంపిస్తున్నారని మాజీ అధ్యక్షుడు ఆరోపించారు. అందుకే అక్కడ నేరాల రేటు పడిపోయి.. అగ్రరాజ్యంలో నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని దుయ్యబట్టారు. ఇలాంటివారిని ఆపడమే తన లక్ష్యమని ట్రంప్ చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలసల చట్టాన్ని మరింత కఠినతరం చేస్తానని, అక్రమ వలసదారులను అడ్డుకుంటానని అన్నారు. ఇటీవల వెనెజువెలాలో జరిగిన ఎన్నికల్లో నికోలస్ మదురో మరోసారి ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ ఫలితాలపై అమెరికా అనుమానం వ్యక్తంచేసింది. అటు మస్క్ కూడా మదురో విధానాలను తీవ్రంగా విమర్శిస్తుంటారు. అక్కడి అధ్యక్ష ఎన్నికల్లోనూ మదురో ప్రత్యర్థికి మస్క్ మద్దతు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఇటీవల 10 రోజుల పాటు వెనెజువెలాలో 'ఎక్స్'పై నిషేధం విధిస్తూ అధ్యక్షుడు ప్రకటన చేయడం చర్చనీయాంశమైంది. ఇదిలాఉండగా.. మస్క్తో ట్రంప్ ఇంటర్వ్యూకు విశేష ఆదరణ లభించింది. ఈ కార్యక్రమాన్ని ఏకంగా 200 మిలియన్ల మందికిపైగా విన్నారు. దీన్ని 'ఎక్స్' స్పేస్లో లైవ్ స్ట్రీమింగ్ చేశారు.

## సెప్టెంబర్ 9న జీఎస్టీ కౌన్సిల్ భేటీ.. - స్లాబులు కుదించే అవకాశం

దిల్లీ (ప్రజామంటలు): జీఎస్టీ మండలి తదుపరి సమావేశం తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 9న కౌన్సిల్ భేటీ కానుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో దిల్లీలో కౌన్సిల్ 54వ సమావేశం జరగనుందని జీఎస్టీ కౌన్సిల్ ఎక్స్లో పోస్ట్ చేసింది. చివరి సారిగా జూన్ 22న భేటీ అయ్యింది. తదుపరి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జీఎస్టీ విషయంలో అత్యున్నత నిర్ణయాక మండలి అయిన జీఎస్టీ కౌన్సిల్లో కేంద్ర ఆర్థిక మంత్రితో పాటు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉంటారు. వచ్చే నెల జరగబోయే ఈ సమావేశంలో రేట్ల హేతుబద్ధీకరణపై చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పన్ను స్లాబులను కుదించే అవకాశం ఉంది. గత సమావేశంలోనే ఈ మేరకు నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. బిహార్ డిప్యూటీ సీఎం సుమంత్ చౌదరి దీనిపై ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. బీమాపై జీఎస్టీ తొలగించాలన్న డిమాండ్ తెరపైకి వచ్చిన వేళ ప్రస్తుత ఉన్న జీఎస్టీని తగ్గించే అవకాశమూ ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి.



### శ్రీ భక్త అంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శ్రీ స్వామివారికి విశేష పంచామృతే అభిషేక కార్యక్రమం

ఇల్లందకుంట ఆగస్టు 13 (ప్రజామంటలు):

ఇందులో గణపతి పూజ పుణ్యాహవాచనం రక్షాబంధనం నవకలశ స్థాపన అభిషేకము చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా నల్ల దేవేందర్ రెడ్డి-కరుణ దంపతులు శ్రీ స్వామివారికి ఇత్తడి తొడుగు సమర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అర్చకులు డింగరి దిలీప్ కుమారాచార్యులు, బట్టర్ శేషాచార్యులు, గోవర్ధన శ్రీ హర్ష చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు శ్రీరామ సేవా సమితి భక్తులు పాల్గొనడం జరిగినది.

## 'వినేశ్ కోసం అందరూ ప్రార్థించండి.. మెడల్ రాకపోయినా ఆమె ఛాంపియనే'

పారిస్ (ప్రజామంటలు): పారిస్ ఒలింపిక్స్లో ఫైనల్కు చేరిన తర్వాత వినేశ్ ఫొగాట్పై అనర్హత వేటు పడింది. ఊహించని ఈ పరిణామంతో వినేశ్తోపాటు ఆమె అభిమానులు ఒక్కసారిగా షాక్కు గురయ్యారు. తనపై వేసిన అనర్హత వేటును సవాలు చేస్తూ రెజ్లర్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ (కాస్)లో అప్పీల్ చేసింది. వాదనలు విన్న కాస్ మరికొన్ని గంటల్లో తీర్పు ఇవ్వనుంది. తీర్పు భారత్కు అనుకూలంగా వస్తే వినేశ్కు రజత పతకం ఇవ్వాల్సిఉంటుంది. ఈ కేసులో వినేశ్ తరఫున వాదించిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులలో ఒకరైన విదుష్పత్ సింఘానియా మీడియాతో మాట్లాడారు."ఇది మాకు చాలా కష్టమైన పని. ఎందుకంటే మా అభిప్రాయాలను సిద్ధం చేయడానికి, వాటిని కాస్ ముందుంచడానికి మాకు చాలా తక్కువ సమయం దొరికింది. కానీ, మేము కష్టపడి పనిచేసి వినేశ్ కోసం పోరాడటానికి సన్నద్ధమయ్యాం. సాధారణంగా కాస్ 24 గంటల్లో తీర్పు ఇస్తుంది. ఈసారి వారు తీర్పు గడువును ఒకటి కంటే ఎక్కువసార్లు పొడిగించారు. నిర్ణయం భారత్కు అనుకూలంగా వస్తుందని మేమందరం ఆశిస్తున్నాం. తీర్పు ఇచ్చే అడ్హక్ ప్యానెల్ 24 గంటల కాలపరిమితిని కలిగిఉంది. దీన్నిబట్టి ఈ అంశం గురించి ప్యానెల్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు అర్థమవుతోంది. న్యాయమూర్తి మహిళ అయితే మాకు మరింత మంచిది. గతంలో నేను చాలా కేసులు వాదించాను. ఇక్కడ సక్సెస్ రేటు చాలా తక్కువ. వినేశ్ ఫొగాట్ విషయంలో చరిత్రాత్మక తీర్పు ఇవ్వాలని న్యాయమూర్తిని కోరుతున్నాం. ఇది కొంచెం కష్టమే అయినా ఏదైనా అద్భుతం జరగాలని ఆశిద్దాం. వినేశ్కు పతకం దక్కాలని అందరూ ప్రార్థించండి. ఒకవేళ మెడల్ రాకపోయినా ఆమె ఛాంపియనే" అని విదుష్పత్ సింఘానియా పేర్కొన్నారు. తీర్పు వెలువడనున్న నేపథ్యంలో వినేశ్ ఇంకా స్వదేశానికి బయలుదేరలేదు. త్వరలో ఆమె భారత్కు వచ్చే అవకాశముంది. సోమవారం తన లగేజీని తీసుకొని ఒలింపిక్ క్రీడాగ్రామం నుంచి వినేశ్ బయటికి వచ్చేసింది.



## చిట్టాపూర్ గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం..

కోరుట్ల ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో తపాల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ ఆవరణలో జాతీయ పతాకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.... జాతి ఐక్యత, సమగ్రత పట్ల నిబద్ధతతో దేశ ప్రజలందరితో దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సామూహిక జాతీయ గీతాలాపన చేసి ప్రతి ఒక్కరు తమ ఇంటిపై ఆత్మగౌరవంతో స్వాతంత్ర దినోత్సవం రోజున త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి త్రివర్ణ పతాకం గొప్పదనాన్ని ఇనుమడింపజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తపాలశాఖ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ దురిశెట్టి రాజేశం, కంది బుచ్చిరెడ్డి, కొత్తపెల్లి రాజారెడ్డి, విష్ణువర్ధన్ రాజు, సత్యనారాయణ, కంది రామ్మోహన్, కొత్తపల్లి రాజేందర్, నారాయణ, బర్ల మల్లేష్, రవి, ప్రణయ్, గుజ్జరి శ్రీనివాస్, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఘన స్వాగతం పలికిన మన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జువ్వాడి నర్సింగరావు. అనంతరం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించి మొన్న ప్రమాదవశాత్తు మరణించిన విద్యార్థుల తల్లితండ్రులను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సి జీవన్ రెడ్డి. ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్. అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ జువ్వాడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



# గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపైన చర్యలు తీసుకోవాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్



జమ్మికుంట ఆగస్ట్ 13 (ప్రజామంటలు):
జమ్మికుంట సిపిఐ మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య నివాసంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి అధికార యంత్రాంగం పైన ఇప్పటివరకు పట్టు సాధించలేకపోయింది. గత ప్రభుత్వం గత పాలకులు ఏ రకమైనటువంటి పరిపాలన కొనసాగించారో.. అదే రీతిలో పరిపాలన కొనసాగుతుంది ఏమాత్రం కూడా మార్పు లేదు. గత ప్రభుత్వం అనుసరించినటువంటి ఆర్థిక, అవినీతి, ఆరోపణల పైన ఈ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందే న్యాయ విచారణ ఆదేశించాల్సిందే అదేవిధంగా దానికి బాధ్యులైనటువంటి వారి పై ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిందే.... అదే సందర్భంలో ఇప్పటివరకు ప్రభుత్వం ప్రజలకు కావలసిన అవసరాలను పైన ఇచ్చిన హామీలపైన నేటి వరకు కూడా సరైనటువంటి కసరత్తును ప్రారంభించి పట్టు సాధించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. గతంలో ఏ విధంగానైతే కేసీఆర్ ప్రభుత్వం కాంగ్రెస్, టిడిపిలో గెలిచిన ఎమ్మెల్యేలను తీసుకొని తన ప్రభుత్వంలో రాజీనామా చేయకుండా మంత్రి పదవులు కొనసాగించిందని... అప్పుడు అరాచకం అక్రమం దుర్మార్గం ఒక పార్టీ నుండి గెలిచిన వారిని మరొక పార్టీలోకి రాజీనామా చేయకుండా మంత్రి పదవులు ఇవ్వడం అనేది తప్పు అని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది.కానీ ఇప్పుడు విచ్చలవిడిగా టిఆర్ఎస్ గెలిచిన ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తీసుకుంటుంది.. ఏదైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజాస్వామ్య శ్రేణులు ప్రగతిశీల వ్యక్తులు అందరు కూడా భావించేది ఏందంటే ప్రభుత్వాలు మారిన జెండాలు మారిన పార్టీ పేరు మారింది పరిపాలన మాత్రం ఒక్కటే ఒక పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను అధికార పార్టీలోకి వచ్చి గదే పరిపాలన కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన పై ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఎవరైనా ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి వచ్చే హక్కు ఉంటది కాని ప్రజాస్వామ్యం పద్ధతులలో ఎన్నికల ద్వారా ఎన్నికైన ఏ ప్రజా ప్రతినిధి అయిన పార్టీ గుర్తుపైన గెలిచిన ఆ పార్టీకి రాజీనామా చేసి వేరే పార్టీలోకి చేరొచ్చు ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి చేయడం సరైనది కాదని కమ్యూనిస్టు పార్టీ భావిస్తుంది దీన్ని తీవ్రంగా ఖండిస్తుంది. ప్రజల చేత ఎన్నిక కాబడిన ఎమ్మెల్యేలు ఏం చెబుతున్నారు అభివృద్ధి కోసం ప్రజల కోసం పోతున్నాం అంటున్నారు ఎమ్మెల్యే ఏ పార్టీలో గెలిచినా ప్రజల పక్షాన ఉంటూ ప్రతిపక్ష పాత్ర పోషించాలి ప్రజల అభివృద్ధి కోసం నియోజకవర్గ డెవలప్మెంట్ కోసం పోరాటం చేసి నిధులు సాధించి అభివృద్ధి చేయాలి తప్ప పెట్టుబడిదారులుగా దోపిడిదారులుగా ఈ ప్రజాస్వామ్యం అపహాస్యం చేసే విధంగా ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారు. కేవలం ఎమ్మెల్యేలు చేసిన అవినీతి దుర్మార్గం అక్రమాలు వాటిని కాపాడుకోవడం కోసమే పార్టీలు మారడం తప్ప మీరు ప్రజలకు మేలు చేస్తామనే ఉద్దేశం కాదు అని కమ్యూనిస్టు పార్టీ భావిస్తుంది... ఏదైనా రాజకీయాల్లో నీతి నిజాయితీ అవసరం అలా కాకుండా ప్రజల సొమ్మును దోచుకునేందుకు వ్యవహరిస్తున్నారు ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం అంతకు మించి డబ్బులు సంపాదించడం తప్ప ప్రజలకు మేలు చేసే విధంగా ప్రజాప్రతినిధులు లేరు... కాబట్టి నీతివంతమైన రాజకీయాల కోసం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం అవినీతికరమైన వాటికి వ్యతిరేకంగా తప్పనిసరిగా కమ్యూనిస్టు పార్టీ రాబోయే కాలంలో మరింత ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తాం. రేపు 20వ తేదీన జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశం హుజురాబాద్ లో నిర్వహిస్తున్నం ఈ సమావేశాలకు రాష్ట్ర పార్టీ నాయకులు కూణం సాంబశివరావు, అదేవిధంగా జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి గారు హాజరవుతున్నారు.. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అనేక అంశాలు గత ప్రభుత్వం ఇచ్చినటువంటి ఈ ప్రభుత్వం రెట్టింపుగా ఇచ్చినటువంటి హామీలను అమలు చేయడం కోసం ఒక కార్యచరణ రూపొందించి భవిష్యత్తు ఉద్యమాల వైపు ప్రజల పక్షాన ఉంటామని కమ్యూనిస్టు పార్టీ మొన్న ఎన్నికల సమయంలో అప్పుడున్న నియంత ప్రభుత్వాన్ని ఓడించడం కోసం ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం కాంగ్రెస్ తో ఎన్నికల అవగాహన చేసుకున్నాం ఆ ఎన్నికల్లో ఒక సీటు గెలిచినా ఒక సీటు కోసం పోటీ చేసిన మన లక్ష్యం దాన్ని ఓడిస్తే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని భావించాం.



# టి సెర్ప్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

చిగురుమామిడి ఆగస్ట్ 13 (ప్రజామంటలు):
చిగురుమామిడి మండలంలోని రైతు వేదికలో చిగురుమామిడి మండలం పాడి పశువుల (ఇందిరా మహిళా శక్తి పాడిపశువుల) లబ్ధిదారులతో ఎం.పి.డి.ఓ. ఖాజా మోహీనుద్దీన్, వెటర్నరీ డాక్టర్స్ డి.కె. సాంబశివరావు మరియు జిల్లా కార్యాలయ వెటర్నరీ డాక్టర్ ఎస్. రామకృష్ణ లు అవగాహన సదస్సు టి సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.... పాడి పశువుల పాల దిగుబడి పెరగడానికి ఖచ్చితంగా వేరే రాష్ట్రం నుండి పశువులను కొనుగోలు చేయాలని, మంచి మేలు జాతి గల పశువు, త్రికోణాకారంగా ఉండేది, పాలనాడి ఎక్కువగా ఉండేది, బలిష్టంగా ఉండే పశువును ఎంపిక చేసుకోవాలని, అలాగే పశువు ఈనిన తర్వాత అర గంటలోపు దూడకి పాలు పట్టించాలని, పచ్చగడ్డి, ఎండుగడ్డి, 70% %డ% 30% వేయాలని, పశువుల పాక శుభ్రంగా ఉంచుకొని అధిక దిగుబడులు సాధించాలని, పరిశుభ్రమైన నీరు పశువులకు పెట్టాలని, టీకాలు వేయించాలని తెలిపారు. ఎం.పి.డి.ఓ. ఖాజా మోహీనుద్దీన్ మాట్లాడుతూ.... పశువుల పాకలకు సన్న, చిన్న కారు రైతులకు షెడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద 90,000 రూపాయల వరకు ఇస్తున్నామని తెలిపారు. అలాగే ఏపిఎం మట్టెల సంపత్ మాట్లాడుతూ.... ఎస్.ఈ.అర్.పి. నుండి బ్యాంకు లింకేజి ద్వారా ఋణం మరియు స్త్రీనిధి ద్వారా ప్రతి పశువుకు 93,270 రూపాయలు ఇచ్చి పశువుకు మరియు లబ్ధిదారు అయినా సభ్యురాలికి ఇన్సూరెన్స్ సౌకర్యం 48 నెలలు కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. అదేవిధంగా పెరటి కోళ్ల పెంపకం లబ్ధిదారులకు కోడి పిల్లలు 50 పిల్లలకు 12,500 రూపాయలు 100 కోళ్లకు 23000 రూపాయలు ఋణం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# రైతులు రాజు కావాలనే ఉద్దేశమే ప్రభుత్వ లక్ష్యం

## రైతులకు అన్ని విధాల సహాయ సాకారం ఉంటుంది



ఎల్కతుర్తి ఆగస్ట్ 13 (ప్రజామంటలు):
ది విశాల సహకార సంఘం లిమిటెడ్ ఎల్కతుర్తి సంఘమును హనుమకొండ జిల్లా కలెక్టర్ సందర్శించినారు రైతు రుణమాఫీ అయినా రైతులు ఎంతమంది ఉన్నారు తెలుసుకున్నారు. 797 మంది రైతులకు రుణమాఫీ అయినదని వారందరికి కూడా మళ్లీ రుణాలు ఇచ్చుచున్నామని అధ్యక్షులు శ్రీపతి రవీందర్ గౌడ్ తెలియజేశారు. సొసైటీ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు మరియు ఫెర్టిలైజర్ కూడా సందర్శించినారు వాటర్ ప్లాంట్ ను చూసినారు. సంఘం అభివృద్ధి గురించి బాగుందని చైర్మన్ ను అభినందించినారు, ఉపాస వినోద వైఫ్ ఆఫ్ రాజేశ్వరరావు 41, 000 రు చెక్కును అందజేశారు. రుణమాఫీ అయిన రైతుకు మళ్లీ రుణము కలెక్టర్ మరియు అధ్యక్షులు శ్రీపతి రవీందర్ గౌడ్ చేతుల మీద అందజేసినారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య హాసన్ పర్తి మండలంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి, అధికారులతో సమీక్షించారు. సంఘం లోని రైతుల వివరాలు, వారు వేసే పంటల పేర్లను, అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి దాకా రైతులకి వచ్చిన రుణ మాఫీ 1,50,000 రూ ఎంత మంది రైతుల ఖాతా లో సొమ్ము జమ ఆయాయో, వారి వివరాలను అధికారులతో తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల రుణ మాఫీ రాకపోవడం, ఇంకా పంట రుణాల సందేహాలు, సమస్యల గూర్చి వచ్చిన రైతుల వివరాలను అధికారులను అడిగారు. వెంటనే వారిని దగ్గర్లో ఉన్న ఎమ్మార్వో ఆఫీస్ లేదా టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని కోరారు. రైతులు వేసిన ప్రతి పంటకు సంబంధించి ఎరువులు, పిచికారి మందుల వివరాలను, అన్ని విక్రయ కేంద్రాలలో ఉన్న స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి వాటిని సకాలంలో రైతులకు అందించి మంచి దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు పిచికారి మందుల పంపిణీ విషయంలో జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయానికి వాడే ప్రతి పని ముట్లు, ఆధునిక పరికరాలు ఎల్లప్పుడూ రైతులకు అవగహన కల్పిస్తూ సరిఅయిన సమయం వాడి మంచి దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, నోడల్ అధికారి సత్యానందం, మనోహర్ రావు, ఉదయ్ కుమార్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పింగిలి వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్లు మల్లారెడ్డి రమేష్ కరుణాకర్ రెడ్డి, సంబంధిత అధికారులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్ ప్రావీణ్య




ఎల్కతుర్తి ఆగస్ట్ 13 (ప్రజామంటలు):
ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. జిలుగులలో మహిళా శక్తి ఆధ్వర్యంలో గ్రౌండింగ్ చేసి ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫార్మ్ ను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని సెర్ఫ్ కార్యాలయంలో మహిళా సంఘాల వివో లతో ఆమె మాట్లాడారు. మహిళలు ఆదాయం పెంపునకు వివిధ రకాల జీవనోపాదులను ఎంచుకోవాలని సూచించారు. ఈ దిశగా మహిళలను చైతన్యం చేయాలని వీవోలకు చెప్పారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు కాకుండా ఇతర జీవనోపాదులు కూడా ప్రోత్సహిద్దాం అని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. పాడి, పౌల్ట్రీ, చిరు వ్యాపారాలను ప్రోత్సహిద్దామని అన్నారు. యూనిట్ ఏర్పాటు చేసుకున్న తర్వాత ఇబ్బందులు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. ఈ దిశగా కమిటీలు పనిచేయాలని సూచించారు. కుట్టు మిషన్ లో భాగంగా ఒక్క పిల్లల యూనిఫామ్ లకే పరిమితం కావద్దని చెప్పారు. అనంతరం సాంఘిక సంక్షేమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి వారితో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జగత్ సింగ్, ఎంపీడీవో విజయ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది, వివో ఏలు, ఎస్సై రాజ్ కుమార్, ఇన్చార్జ్ ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల పెద్దపూర్ హాస్టల్ ను డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క తో సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కొరుట్ల ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జువ్వాడి నర్సింగరావు, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్.

# ఒక్కరి ఆర్గాన్స్ తో మరెందరికో పునర్జన్మ

## గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. ఇందిర

## గాంధీలో వరల్డ్ ఆర్గాన్స్ డోనేషన్ డే

సికింద్రాబాద్ ఆగస్ట్ 13 (ప్రజామంటలు):
అవయవదానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఒక్కరి అవయవాల దానంతో ఎందరో ప్రాణాలను కాపాడి, వారికి పునర్జన్మ ఇవ్వవచ్చని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కే. ఇందిర అన్నారు. వరల్డ్ ఆర్గాన్స్ డే సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్గాన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ మెడికల్ కాలేజీ లో మెడికోలకు ఆర్గాన్స్ డోనేట్ పై అవెర్నెస్ కల్పించారు. సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ....అవయవాల దానం చేసిన వ్యక్తి అంత్యక్రియలను అధికార లాంఛనాలతో జరుపుతామని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు బ్లడ్ డోనేట్ చేస్తే ఆ ఒక్క రోజు సెలవు ఇవ్వాలని కోరారు. కర్నాటక మాదిరిగా జాతీయ పండుగల కార్యక్రమానికి అవయవదాతల ఫ్యామిలీ మెంబర్స్ ను స్పెషల్ గా ఇన్వైట్ చేసి, వారిని సన్మానించాలని కోరారు. ప్రతి ఒక్కరు అవయవ దానం గురించి ప్రచారం నిర్వహించాలని కోరారు. పేద, మధ్య తరగతి ప్రజలే అవయవదానం చేస్తున్నందున వారి ఫ్యామిలీలోని ఒకరికి ఉద్యోగం, లేదా ఉపాది అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

అవయవదానం పై ప్రచారం చేస్తామని, ప్రోత్సహిస్తామని మెడికోలతో ప్రతిజ్ఞ చేయించారు. స్టేట్ ఆర్గాన్, బాడీ డోనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గురుప్రకాశ్, ఫౌండర్ ప్రెసిడెంట్ సీతా మహాలక్ష్మీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకేష్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు..





## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్న సందర్భంగా
# బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 13 (ప్రజామంటలు): పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించడానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్న సందర్భంగా ముందస్తు చర్యలు భాగంగా ఇబ్రహీంపట్నం మండలంకి చెందిన పలువురు బీజేవైఎం నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షులు బోడ నవీన్ మాట్లాడుతూ, బీజేవైఎం ఏబీవీపీ పోరాటాల ఫలితంగానే ఈ రోజు బట్టి విక్రమార్క గారి పర్యటన అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులని మంత్రి గారిని కలవడానికి అవకాశం ఇవ్వాలని మా సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరడమైనది. ఏది ఏమైనా ఇకనుంచి అయినా రాష్ట్రవ్యాప్తంగా విద్య వ్యవస్థ పై సమీక్ష జరగాలని ఇబ్రహీంపట్నం మండలం కి చెందిన బీజేవైఎం మండల అధ్యక్షులు బోడ నవీన్, బీజేవైఎం ఉపఅధ్యక్షులు పుస్తెమ్ మహేందర్, బీజేవైఎం ఉపఅధ్యక్షులు గంగుల మనోజ్, మరియు బీజేవైఎం నాయకులు తదితరులను ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా తమను పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేవైఎం నాయకులు ఖండించారు.



జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసిన జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారిగా నూతనంగా నియామకం అయిన యం. శ్రీనివాస్



## బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు జమ్మికుంట బంధు కు పిలుపు

జమ్మికుంట ఆగస్ట్ 13 (ప్రజామంటలు): బంగ్లాదేశ్ లో హిందువుల పై జరుగుతున్న దాడులకు నిరసనగా జమ్మికుంట పట్టణంలో రేపు అనగా బుధవారం అన్ని వర్గాల వ్యాపారస్తులు, కిరాణం, బట్టల, మెడికల్, ఫర్టిలైజర్ షాపులు మరియు ఇతర వ్యాపారుల తమ ఆలోచనతో జమ్మికుంట బందుకు పిలుపునివ్వడం జరిగింది. మరియు దేవాలయాల కమిటీ అధ్యక్షులు, అయ్యప్ప స్వాములు, హనుమాన్ స్వాములు మరియు హిందూ బంధువులు మరియు స్కూల్ %ు% కాలేజీ యజమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ "బందు" ను విజయంతో చేయగలరని హిందూ ఐక్యవేదిక సభ్యులు కోరారు.

## పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి





మెట్ పల్లి ఆగస్ట్ 13 (ప్రజామంటలు): మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి. విద్యార్థులు గణాధిత్య, అనిరుధ్ మృతికి గల కారణాలను తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. గురుకుల పాఠశాలలో విద్యార్థులు, తల్లి దండ్రులతో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇద్దరు విద్యార్థుల మృతి నలు గురు విద్యార్థుల అస్వస్థతకు సంబం ధించిన సమగ్ర వివరాలను గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డిని విచారించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్. ప్రతినెల విద్యార్థుల ఆరోగ్యాన్ని చెక్ చేయిస్తున్నారా అని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి. గురు కుల పాఠశాలలో ఉన్న వస తులు, ఉన్న సి బ్బంది, గురుకుల పాఠశాలలో డ్యూటీ నర్స్ సంబంధించిన వివరాలపై ఆరా తీసిన డిప్యూటీ సీఎం కంటతడి పెట్టిన విద్యార్థుల తల్లిదండ్రు లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓదార్చారు.



సింగరేణి జీఎం ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐ.ఎన్.టి.యు.సి., కాంగ్రెస్ నాయకులు



స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ లో ఏర్పాట్లను పరిశీలించిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పోలీసు సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది..



## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హనుమకొండ ఆగస్ట్ 13 (ప్రజామంటలు): హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) 9 మంది లబ్ధిదారులకు సుమారు 4 లక్షల రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఆరోగ్య శ్రీ లో వర్తించని వ్యాధులకు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు సౌరం అభిలాష్ , చిన్ని, పస్తం శంకర్, పత్రి రాజేష్, యూత్ నాయకులు సౌరం టోని, గంధం సారంగపాణి మరియు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పట్టణ సమాఖ్య సమావేశం

జమ్మికుంట ఆగస్ట్ 13 (ప్రజామంటలు): జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జీవనజ్యోతి పట్టణ సమాఖ్య సర్వసభ్య సమావేశం మంగళవారం పట్టణ సమాఖ్య అధ్యక్షులు రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్సిపల్ ఛైర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు, కమీషనర్ మహమ్మద్ అయాజ్, మెప్మా డిఎంసి శ్రీవాణి, ఇంచార్జ్ టిఎంసి మానస, మల్లీశ్వరిలు హాజరైయ్యారు. ముందగా జీవితాన గెలుపుందిన ప్రార్ధన ఆలకించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ రాజేశ్వర్ రావు, కమీషనర్ మహమ్మద్ అయాజ్ లు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న 748 సంఘ సభ్యులు ఆక్టివ్ గా తడి, పొడి చెత్తను వేరు చేయాలని, సంఘాలలో ఉన్న ఆర్పీలు తమ సభ్యులతో సమన్వయం అవుతూ డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు ప్రభలకుండ చూడాలని అన్నారు. మహిళా శక్తి కింద కేటాయించిన మహిళలను గుర్తించి వారిని ఆర్థికంగా ఎదగాలని కొంతమందిని గుర్తించారని, అదేవిధంగా మిగతా సభ్యులు కూడా ఆర్థికంగా బ్యాంకు నుండి తీసుకున్న రుణాలతో కొంత మొత్తం ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా డిఎంసి శ్రీవాణి, ఏడిఎంసి లు మాట్లాడుతూ మహిళ శక్తి కింద కేటాయించిన వెజ్ %ు% ఫ్రూట్, బేకరీ, డైరీ ప్రొడక్ట్స్, మైక్ సెట్, టెంట్ హౌస్, ఫాన్సీ స్టోర్, కిరాణం, సారీ రోలింగ్, ఫుడ్ ట్రక్స్, సంఘాల ప్రొడక్ట్స్ కింద 51 మందిని కేటాయించి వారిని ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం తోడ్పడుతున్నట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షురాలు రాణి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలలో అభ్యున్నతికి తమ వంతు పాత్ర ఉండడం చాల సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల భాస్కర్, సీఎల్ ఆర్పీలు, ఆర్పీలు, ఒబిలు పలువురు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



## పద్మశాలి సేవా సంఘ నూతన కార్యవర్గాన్ని సన్మానించిన అందరినీ శ్రీ లక్ష్మీ గణేష్ మందిర నిర్వాహకులు

జగిత్యాల ఆగస్ట్ 13 (ప్రజామంటలు): జిల్లా కేంద్రం లోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయములో ఈ నెల 11 వ తేదీ ఆదివారం జరిగిన ఎన్నికలలో ఘన విజయం సాధించిన, కార్యవర్గ సభ్యులు అందరినీ శ్రీ లక్ష్మీ గణేష్ మందిరంలో నిర్వాహకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. అద్యక్షులు భోగ గంగాధర్, ఉపాధ్యక్షులు భోగ రాజ కుమార్, ప్రధాన కార్య దర్శి గాదాసు రాజేందర్, సంయుక్త కార్యదర్శి మానపురి మహేష్, మరియు డైరెక్టర్ లుగా ఎన్నికైన మ్యాన శబరి, కస్తూరి నరేష్, కోప్పు సందీప్, వేముల శంకర్, సాంబారి కళావతి, మంచాల జమున లను సన్మానించారు. ఈ కార్య క్రమంలో కోటగిరి శ్రవణ్ కుమార్, జిల్లా ప్రభాకర్, యాదగిరి మారుతీ రావు, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణములో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి
### భజరంగ్ దళ్ కార్యకర్తల వినతిపత్రం



కోరుట్ల ఆగస్ట్ 13 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న జంక్షన్ లలో భాగంగా హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుట్ల హిందూ బంధువులు కోరుకుంటున్నారు. ఈ విగ్రహం జాతీయ రహదారి కల్లూరు రోడ్డు జంక్షన్ (చౌరస్తా) సిగ్నల్ వద్ద ఇట్టి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే ఆ చౌరస్తా దగ్గరిలోనే శివాజీ నగర్ ఉంది మరియు కల్లూరు రోడ్డు జంక్షన్ కి శివాజీ చౌక్ గా నామకరణం అయేలా వీలుంటుంది అని ఈరోజు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోరుట్ల భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

మల్లాపూర్ ఆగస్ట్ 13 (ప్రజామంటలు): మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో తపాల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ ఆవరణలో జాతీయ పతాకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.... జాతి ఐక్యత సమగ్రత పట్ల నిబద్ధతతో దేశ ప్రజలందరితో దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సామూహిక జాతీయ గీతాలాపన చేసి ప్రతి ఒక్కరు తమ ఇంటిపై ఆత్మగౌరవంతో స్వాతంత్ర దినోత్సవం రోజున త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి త్రివర్ణ పతాకం గొప్పదనాన్ని ఇనుమడింపజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తపాల శాఖ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ దురిశెట్టి రాజేశం, కంది బుచ్చిరెడ్డి, కొత్తపెల్లి రాజారెడ్డి, విష్ణువర్ధన్ రాజు, సత్యనారాయణ, కంది రామ్మోహన్, కొత్తపల్లి రాజేందర్, నారాయణ, బర్ల మల్లేష్, రవి, ప్రణయ్, గుజ్జరి శ్రీనివాస్, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన కోటి కుంకుమార్చన అటెండ్ అయిన ఎంపీ డా. కే. లక్ష్మన్



సికింద్రాబాద్ ఆగస్ట్ 13 (ప్రజామంటలు): పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా వారణాసి స్వామి అభిషేక్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి కుంకుమార్చన పూజలు మంగళవారం నాటితో ముగిశాయి. చివరి రోజు జరిగిన పూర్ణా హుతి కార్యక్రమానికి ఎంపీ డా. కే. లక్ష్మన్, బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్ రావులు హాజరై, పూజల్లో పాల్గొన్నారు. మహిళలు పెద్దసంఖ్య లో కోటి కుంకుమార్చన పూజల్లో పాల్గొని, త్రిపురసుందరి దేవి సన్నిధానం లో సంకీర్తనలు ఆలపించారు. యువచేతన నేషనల్ కో ఆర్డినేటర్ రోహిత్ కుమార్ సింగ్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.






# నేషనల్ హ్యాండ్లూమ్ డే వారోత్సవాలు

గుంటూరు ఆగస్టు 13 (ప్రజా మంటలు)

నేషనల్ హ్యాండ్లూమ్డే వారోత్సవాలు సందర్భంగా గుంటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వారాంతపు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా.... స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత వస్త్రాలు దినోత్సవం జరుపుకునే సందర్భంలో ప్రతిరోజు వాతావరణాన్ని సమతులంగా ఉంచడానికి చేనేత వస్త్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరూ చేనేతను వినియోగించుకోవడం వల్ల నేత కార్మికుల ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపరచడమే కాకుండా భారత దేశ ఆర్థిక విధానానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా భారతీయ వస్త్ర పరిశ్రమ రూపుదిద్దుకుంటుందని ఈ సందర్భంగా నేను ఉపన్యాసించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోత్స్న ఉమెన్స్ వింగ్ హెడ్ విజయలక్ష్మి పలువురు ప్రోఫిసర్లు వందలాది మంది విద్యార్థులు తోపాటు సుబ్బలక్ష్మి కూడా పాల్గొన్నారు.

### జ్యోతిబా పాఠశాలలో ఆటలాడుతుండగా అస్తమా బాలిక పడిపోవడంతో

# షాక్ కు గురైన బాలికలు

గొల్లపల్లి ఆగస్టు 13( ప్రజా మంటలు)

గొల్లపెల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మహాత్మ జ్యోతిబాపూలే గర్ల్స్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం బాలికలు కోకో ఆడుతుండగా శ్రీజ పదవ తరగతి అమ్మాయి ఒక్కసారిగా ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా మారడంతో ఆమెతో ఉన్నటువంటి బాలికలు భయానికి లోనైనారు. దీంతో వారు షాకు గురికాగా వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పలు రకాల అపోహలు వస్తున్నాయి. ఫుడ్ పాయిజన్ అయిందని పలువురు భావిస్తున్నారు. వాస్తవానికి 15 ఆగస్టు కోసమని ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగా కోకో ఆడుతుండగా శ్రీజ అనే బాలిక తోటి విద్యార్థులతో ఆడుచుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సంబంధిత పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తెలుపుతున్నారు. శ్రీజకు గతంలో ఇలాంటి ఘటన జరిగినట్లు డాక్టర్ల సూచన మేరకు నాజిల్ స్ప్రే వాడుతుందని మంగళవారం రోజు నాజిల్స్ స్ప్రే అందుబాటులో లేకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తోటి విద్యార్థులు తెలుపుతున్నారు. శ్రీజ కు ఇటీవల ముక్కులో అదనపు కొవ్వు పేర్కోవడంతో ఆపరేషన్ జరిగినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాల ప్రిన్సిపల్ సుస్మిత ఇటీవలే జిల్లా గురుకులాలకు కన్వీనర్ గా నియామకం కావడంతో ఉప ముఖ్యమంత్రి పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు మంగళవారం విచ్చేసిన సందర్భంగా ప్రిన్సిపల్ సుస్మిత తన బాధ్యత రిత్యా అక్కడికి వెళ్లినట్లు సమాచారం. జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 108 వాహనం ద్వారా అక్కడి స్టాఫ్ నర్స్ సుమలత విద్యార్థులను ఆసుపత్రికి తీసుకువచ్చారని వైద్య



బృందం పరీక్షలు నిర్వహించినామని హార్ట్ బీటింగ్ నార్మల్ గా ఉందని లంగ్స్ క్లియర్ గా ఉన్నాయని ఆటల్లో ఒత్తిడికి గురైనప్పుడు ఆయాసం జరిగి ఇలాంటి ఘటన చోటుచేసుకునే అవకాశం ఉంటుందని ప్రస్తుతానికి ఆరోగ్యం అందరిదీ నిలకడగా ఉందని తెలియజేశారు పూర్తి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.పాఠశాలలో జరిగిన ఘటనతో సమాచారం అందుకున్న పేరెంట్స్ తమ తమ పిల్లలను ఇండ్లకు తీసుకువెళ్లారు.

### నార్త్ కెనాల్ నీళ్లు రాక వేసిన

# నాట్లు విలవిల

- దేవాదుల నార్త్ కెనాల్ నీటిని వెంటనే విడుదల చేయాలి..
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్



భీమదేవరపల్లి, ఆగస్టు 13 (ప్రజామంటలు) :

ధర్మసాగర్ రిజర్వాయర్ నార్త్ కెనాల్ నుండి దేవునూరు, దామెర, కొత్తపెల్లి, ముల్కనూర్ మీదుగా వివిధ గ్రామాలకు వెంటనే నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మండల సురేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ముల్కనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేవాదుల నార్త్ కెనాల్ ను నమ్ముకుని రైతులు వరి నార్లు వేసుకున్నారని తెలిపారు. దాదాపు వరి నారు పోసి 45 రోజులు గడుస్తున్న కెనాల్ నీటిని అధికారులు విడుదల చేయలేదని మండిపడ్డారు. కెనాల్ నీటిని విడుదల చేయక పోవడంతో వరి నారు వేసిన రైతులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వరి పంట ఎండిపోకుండా అధికారులు అప్రమత్తమై నార్త్ కెనాల్ నీటిని విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## జర్నలిస్టుల మనోవాంఛ నెరవేరాలని ఆశీస్సులు అందజేస్తూ దీక్ష విరమింపజేసిన బ్రాహ్మణ సేవా సంఘ బాధ్యులు

జగిత్యాల ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం చేస్తున్న దీక్షలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. కాగా దీక్ష విరమణను స్థానిక అఖిల బ్రాహ్మణ సేవా సంఘం బాధ్యులు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం ఆశీర్వచనం చేసి దీక్షలు విజయవంతం కావాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. అదేవిధంగా బుధవారం స్థానిక పలు ఆలయాల్లో పరమశివుని ప్రార్థిస్తూ అభిషేకాలు నిర్వహిస్తామని ఆ బోలా శంకరుడు జర్నలిస్టుల మనోవాంఛ నెరవేర్చి వారికి శీఘ్రముగా సొంతగృహంలో ప్రవేశించడానికి భగవంతుని కరుణాకటాక్షములు ఉండాలని అభిషేకములు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో..

# జగిత్యాల 'బంద్' ప్రశాంతం

జగిత్యాల ఆగస్ట్ 13 (ప్రజామంటలు):



బంగ్లాదేశ్ లో హిందువులపై, ఆలయాలపై జరుగుతున్న దాడుల నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన జగిత్యాలలో బంద్ ప్రశాంతంగా విజయవంతమైంది. జగిత్యాల తోపాటు రాయికల్ మున్సిపల్ లో వ్యాపార, వాణిజ్య వర్గాలు, హొటల్లు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.విద్యా సంస్థలు, హొటల్లు, షాపింగ్ సెంటర్లు, సినిమా థియేటర్లు బందులో స పాల్గొన్నాయి. బంద్ సందర్భం గా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ప్రముఖ బందోబస్తు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, అంకర్ సుధాకర్, చీటీ చంద్రశేఖర్ రావు, వీరబత్తిని అనిల్, బడే శంకర్, లక్ష్మ రెడ్డి, నవ్వోతు సురేష్, గాజోజూ సంతోష్, జిత్తవేని అరుణ్, బిట్టు, పరంధము, వికాస్ రావు, పదం మహేందర్, గట్టిపెల్లి జ్ఞానేశ్వర్, ఎర్ర శ్రీను, నాగరాజు, భార్గవ్, పవన్, సంతోష్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో సేవా భావాన్ని పెంచేందుకే లయన్స్ క్లబ్ ఏర్పాటు

- అధ్యక్షుడు ముస్కు కర్ణాకర్ రెడ్డి



గొల్లపల్లి ఆగస్ట్ 13 (ప్రజామంటలు):

గొల్లపల్లి మండల కేంద్రంలో ప్రజల్లో సేవాభావాన్ని పెంచేందుకే లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ ముస్కు కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని రెడ్డి సంఘ భవనంలో గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఏర్పాటైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ అనుమండ్ల రాజిరెడ్డి హాజరయ్యారు ఆయన మాట్లాడుతూ.... సంస్థ నిర్వహణకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నరు లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు తమ వంతుగా మానవత్వాన్ని చాటుకుంటూ క్లబ్ కొత్త కమిటీ మరిన్ని సేవలు అందించనుందన్నారు. లయన్స్ వైస్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ సింహరాజు కోదండరాం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం ప్రతిజ్ఞ చేయించి నూతన సభ్యులను సభకు పరిచయం చేశారు. లయన్ ప్రముఖులు వైస్ సెకండ్ డిస్టిక్ గవర్నర్ లయన్ మోర బద్రేశం, లయన్ శ్రీనివాసరావు, లయన్ ఆనంద్, రీజియన్ చైర్ పర్సన్ లయన్ తన్నీరు రాజేందర్, ప్రోగ్రాం చైర్ పర్సన్ కుంట మల్లారెడ్డి ప్రత్యేక అతిథులుగా హాజరై మాట్లాడారు. రీజియన్ చైర్ పర్సన్ తన్నీరు రాజేందర్ మరియు లయన్ ప్రముఖుల పర్యవేక్షణలో నూతన కమిటీ అధ్యక్షుడిగా లయన్ ముస్కు కర్ణాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొమ్మెన కుమార్, కార్యదర్శిగా లయన్ సాయిని నరహరి, కోశాధికారిగా లయన్ కంబార్కర్ అరుణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వివిధ విభాగాల చైర్మన్లుగా 12 మంది వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 7 మందిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమం అనంతరం లయన్స్ క్లబ్ గొల్లపెల్లి సర్వీస్ సెంటర్ ను లయన్ ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ముస్కు కరుణాకర్ రెడ్డి రెండు నెలల సేవా కార్యాక్రమాలు ప్రకటించారు. ఇతర కార్యవర్గసభ్యులు అధ్యక్షులను మరియు అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందించారు.




# మా కాళ్లు అరిగిన కరుణించరా ప్రజాప్రతినిధులారా?

**ఇండ్ల స్థలాల కోసం ఎన్నాళ్ళు పడిగాపులు**

**మా తెల్ల బట్టల వెనుక దుర్భర పరిస్థితులు ఎవరికి తెలుసు**

**జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు**

**జర్నలిస్టుల అర్ధ నగ్న నిరసన ప్రదర్శన..**

జగిత్యాల ఆగష్టు 13 (ప్రజా మంటలు) :



జిల్లా కేంద్రంలో ఇళ్ల స్థలాల సాధన కోసం జర్నలిస్టులు మంగళవారం అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. ఇళ్ల స్థలాల సాధన కోసం గత 15 రోజులుగా వివిధ రూపాలలో నిరసన ప్రదర్శన చేసిన జర్నలిస్టులు గత 11 రోజులుగా నిరవధిక నిరసన దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట గల దీక్ష శిబిరం నుండి అర్ధ నగ్నంగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టులకు న్యాయపరంగా దక్కాల్సిన ఇళ్ల స్థలాల కోసం గత 30 సంవత్సరాలుగా పడి గాపులు కాసే పరిస్థితిని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు తీసుకువచ్చారన్నారు. జర్నలిస్టుల తెల్ల బట్టల వెనుక ఎలాంటి దుర్భర పరిస్థితులు ఉంటాయో ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు గమనించా లన్నారు. మూడు దశాబ్దాలుగా తమ హక్కుల కోసం కాళ్లు అరిగేలా తిరిగిన ఫలితం లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో జర్నలిస్టులు ఆందోళన బాట పట్టడం జరిగిందన్నారు. వృత్తిపరంగా సమాజంలో గౌరవప్రదంగా ఉండే జర్నలిస్టులు అర్ధనగ్న ప్రదర్శన చేయాల్సిన పరిస్థితిని తీసుకువచ్చిన ప్రభుత్వం, ప్రజా



ప్రతినిధులు సిగ్గుపడాల్సిన పరిస్థితి ఈరోజు వచ్చిందని ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com